www.prajavinikidi.com RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -106 శుక్రవారం 31 జులై 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545



## బస్ టికెట్‌తో పాటే ఆటో బుకింగ్..

టీజీఎస్ఆర్టీసీ సరికొత్త సేవలు.. తక్కువ ఛార్జీలతో ఎలక్ట్రిక్ ఆటోలు

ప్రయాణికుల కోసం 'ఫస్ట్ మైల్, లాస్ట్ మైల్' కనెక్టివిటీకి ఆర్టీసీ శ్రీకారం

ఇంటి నుంచి బస్టాప్‌కు, బస్టాప్ నుంచి గమ్యానికి ఈ-ఆటో సేవలు

బస్ టికెట్‌తో కలిపి ఆటో రైడ్ బుక్ చేసుకునే ప్రత్యేక సౌకర్యం

మొదట హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా,

తర్వాత ఇతర నగరాలకు విస్తరణ

ప్రైవేట్ యాప్‌ల కన్నా తక్కువ ఛార్జీలతో సేవలు అందించేలా ప్రణాళిక

**హైదరాబాద్ జూలై 30 ,(ప్రజావినికిడి):**
తెలంగాణలో ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే దిశగా టీజీఎస్ఆర్టీసీ మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. బస్సు ప్రయాణికులకు ఇంటి నుంచి బస్ స్టాప్ వరకు, బస్సు దిగాక గమ్యస్థానం వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణాన్ని కొనసాగించేందుకు 'ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్' కనెక్టివిటీ విధానాన్ని అమలు చేయనుంది. ఇందులో భాగంగా త్వరలోనే రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ప్రముఖ ఎలక్ట్రిక్ ఆటో తయారీ కంపెనీలతో ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. మిగతా 2లో...

# ఉపాధ్యాయులదే భావితరం బాధ్యత

నాణ్యమైన విద్యకోసంఏం చేయాలో మీరే చెప్పండి

ఒక్కో విద్యార్థిపై రూ.1.8 లక్షలు ఖర్చు చేస్తున్నా

తల్లిదండ్రులు ఎందుకు ప్రయివేటుకు పంపుతున్నారో ఆలోచించండి

టీచర్ల సమస్యలు పరిష్కరించే బాధ్యత నాదే

ఫిన్‌లాండ్, జర్మనీ దేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయ బృందంతో

సీఎం రేవంత్ రెడ్డి ముఖాముఖి



**హైదరాబాద్ జూలై 30 ,(ప్రజావినికిడి):**
దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందనీ, దాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. వారిద్దరి బాధ్యతను తానే స్వయంగా తీసుకుంటానన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామనీ, అదే సమయంలో ఉపాధ్యాయ సంఘాలు వారి కోసం కాకుండా విద్యార్థుల కోసం పోరాడాలని సూచించారు. గత ప్రభుత్వంలో ఏనాడూ 1వ తేదీ జీతాలివ్వలేదని గుర్తు చేశారు. ఆ పరిస్థితిని తాము మార్చామన్నారు. ప్రభుత్వం కోసం పని చేసే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలివ్వకపోతే అది పాలకుల వైఫల్యమేనని గుర్తించి, మిగతా 2లో...



## తెలంగాణ జలాశయాలకు పోటెత్తుతున్న వరద...

తెలంగాణలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు

ఉప్పొంగి ప్రవహిస్తున్న నదులు, వాగులు, వంకలు

జూరాల, శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు ప్రాజెక్టులకు భారీగా వరద నీరు

**హైదరాబాద్‌జూలై 30 ,(ప్రజావినికిడి):**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నదులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రధాన జలాశయాలకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతుండటంతో పాటు జూరాల, శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు ప్రాజెక్టుల నీటిమట్టాలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జలపాతాలు, నదీ తీర ప్రాంతాల వద్ద పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. మిగతా 2లో...




# ఆంధ్ర నుంచి విదేశాలకు క్లీన్ ఎనర్జీ

పత్తికొండ సమీపంలో టాటా రెన్యువబుల్ ఎనర్జీ శంకుస్థాపన సభలో మంత్రి నారా లోకేష్

ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల ఎంపిక ఆంధ్రప్రదేశ్: మంత్రి నారా లోకేష్

గత ప్రభుత్వ చర్యలతో పెట్టుబడిదారుల విశ్వాసం కోల్పోయిందని వ్యాఖ్య

పరిశ్రమలు తేవడం మా బాధ్యత.. కష్టపడటం యువత బాధ్యత

**పత్తికొండ జూలై 30 ,(ప్రజావినికిడి):**
ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల తొలి ప్రాధాన్యతగా మారిందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బ్రూక్‌ఫీల్డ్, బ్లాక్‌స్టోన్, బ్లాక్‌రాక్, ఈక్యూటీ, టీపీజీ వంటి ప్రతిష్టాత్మక గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్‌లు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయని, మిగతా 2లో...




# రాజ్యసభలోనూ బిల్లు ఆమోదం

రాష్ట్రపతి ఆమోదం లభించిన వెంటనే అమల్లోకి చట్టం

గరిష్ఠంగా రూ.10 కోట్ల జరిమానా -జైలు శిక్ష, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ

ఎన్‌టీఏపై ప్రతిపక్షం విమర్శలు -సమగ్ర సంస్కరణలపై కొనసాగుతున్న డిమాండ్



**న్యూఢిల్లీ,జూలై 30,(ప్రజావినికిడి):**
దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, పేపర్ లీక్‌లను అరికట్టడం లక్ష్యంగా తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026కు పార్లమెంట్ ఆమోదం లభించింది. ఇప్పటికే లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లుకు గురువారం రాజ్యసభలోనూ ఆమోదం లభించింది. దీంతో రాష్ట్రపతి అంగీకారం లభించగానే ఇది చట్టంగా అమల్లోకి రానుంది. మిగతా 2లో...

# వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు

అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి పొంగులేటి



**హైదరాబాద్,జూలై 30,(ప్రజావినికిడి):**
వాయుగుండం ప్రభావం నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకావంఉండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనిస్తున్న తీవ్ర వాయుగుండం, చురుగ్గా ఉన్న నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక చేసింది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో రెవెన్యూ యంత్రాంగంమిగతా 2లో...

# బీజేపీలో చేరకపోతే.. అంతు చూస్తామన్నారు

సీజేపీ నేత దీప్కే సంచలన ఆరోపణలు

ప్రధాని పదవిని మరొకరికి ఇచ్చి సోషల్ మీడియా

ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మారాలి.. మోదీకి సూచన

అమిత్‌షా ఆదేశాలతోనే విద్యార్థులపై దాడులు

ఆయన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్

విద్యార్థులపై వేధింపులను నిలిపివేయాలి

లేదంటే ప్రభుత్వాన్నే మార్చేస్తాం.. దీప్కే హెచ్చరిక



**న్యూజూలై 30,(ప్రజావినికిడి):**
బీజేపీలో చేరకపోతే అంతుచూస్తామంటూ తనను బెదిరించారని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే సంచలన ఆరోపణలు చేశారు. తన స్వస్థలమైన మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో గురువారంమిగతా 2లో...

# ఆంధ్ర నుంచి విదేశాలకు క్లీన్ ఎనర్జీ

**మొదటిపేజీ తరువాయి**

టాటా పవర్, సుజ్లాన్, రెన్యూ, ప్రీమియర్ ఎనర్జీస్, ఏసీఎంఈ, వారీ వంటి ప్రముఖ భారతీయ దిగ్గజ సంస్థల తమ కార్యకలాపాలను ఇక్కడ విస్తరిస్తున్నాయని ఆయన వెల్లడించారు. పత్తికొండ సమీపంలోని హోసూరు వద్ద టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ (టీపీఆర్ఈఎల్) ఆధ్వర్యంలో రూ.5,350 కోట్లతో అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న 800 మెగావాట్ల క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు గురువారం మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, గత ఏడాదితో పోలిస్తే ఈ ఒక్క ఏడాదిలోనే ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 400 శాతం పెరిగిందని, రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న విశ్వసనీయత వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు.

**పెట్టుబడిదారుల్లో నమ్మకం పెంపొందించాం**

"రాష్ట్రంలో 2024 జూన్ లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు, పునరుత్పాదక ఇంధన రంగం పూర్తిగా అస్తవ్యస్తంగా ఉండేది. అంతకుముందు ఐదేళ్లలో కనీసం ఒక్క మెగావాట్ సామర్థ్యం గల ప్రధాన రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు కూడా ప్రారంభించలేదు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేశారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం దెబ్బతింది. ప్రపంచంలోని అనేక అతిపెద్ద ఇన్‌ఫ్రా, క్లైమేట్ ఫండ్స్ ఆంధ్రప్రదేశ్‌ను బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాయి. ఒకసారి దెబ్బతిన్న విశ్వాసాన్ని పునరుద్ధరించడం రాత్రికి రాత్రే సాధ్యంకాదు. పెట్టుబడిదారుల్లో మళ్లీ నమ్మకాన్ని పెంపొందిస్తూ వచ్చాం" అని పేర్కొన్నారు.

**ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీతో తొలిఅడుగు**

ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ - 2024ను ప్రవేశపెట్టి విస్తృతమైన విజన్‌తో 160 గిగావాట్ల క్లీన్ ఎనర్జీ సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని అన్నారు. సోలార్ మాడ్యూల్స్, సెల్స్ నుండి బ్యాటరీలు, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, ట్రాన్స్ మిషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, పోర్ట్స్, స్టోరేజీ సిస్టమ్స్.. ప్రపంచ స్థాయి తయారీ వరకు – మొత్తం క్లీన్ ఎనర్జీ సప్లయ్ చైన్ ను ఆంధ్రప్రదేశ్ లో నిర్మించాలని అనుకున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఇంధనాన్ని వినియోగించుకోవడమే కాకుండా, క్లీన్ ఎనర్జీ టెక్నాలజీలకు గ్లోబల్ ప్రొడ్యూసర్ గా మారాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని లోకేష్ తెలిపారు.

**టాటా రెన్యువబుల్ ప్రాజెక్ట్.. మా విజన్ కు నిదర్శనం**

"టాటా రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ రూ. 5,750 కోట్ల పెట్టుబడితో, పత్తికొండలో 400 మెగావాట్ల సౌర విద్యుత్‌ను, అనంతపురం జిల్లా కనేకల్లులో 400 మెగావాట్ల పవన విద్యుత్‌తో కలిపి, 800 మెగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టుగా అవతరించబోతోంది. ఈ ఒక్క ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో దాదాపు 4,000 ఉద్యోగాలను కల్పిస్తుంది. 3,400 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో గల ఈ ప్రాజెక్టు ద్వారా 1,100 పైగా రైతు కుటుంబాలకు దాదాపు మూడు దశాబ్దాల పాటు స్థిరమైన కౌలు ఆదాయాన్ని అందిస్తుంది. ఈ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్‌పైనా, మా పరిపాలనపైనా విశ్వాసానికి ప్రతీక.

**టాటా గ్రూప్ తో మాకు ప్రత్యేకమైన అనుబంధం**

టాటా గ్రూప్‌తో మాకు దశాబ్దాల తరబడి అనుబంధం ఉంది. 1990లో నా తండ్రి చంద్రబాబు నాయుడు గారు హైదరాబాద్‌లో 'హైటెక్ సిటీ'ని నిర్మిస్తున్నప్పుడు, ఆయన దార్శనికతను నమ్మిన మొట్టమొదటి సంస్థలలో టిసిఎస్ ఒకటి. ఆ నమ్మకంతో కూడిన అనుబంధం నేటికీ కొనసాగుతోంది. 2024లో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, నేను టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్‌ను కలిసి ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించడానికి ఆంధ్రప్రదేశ్ భిన్నంగా ఏమి చేయాలి అని అడిగాను. "వేగంపై దృష్టి పెట్టండి. పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాల కంటే జాప్యం వల్ల కలిగే నష్టమే ఎక్కువ," అని ఆయన చెప్పారు. మా ప్రభుత్వ విధానం కూడా సింపుల్, స్పీడ్, స్టేబిలిటీలో భాగం అయ్యింది. శంకుస్థాపన నుండి ప్రారంభోత్సవం వరకు ప్రభుత్వం మద్దతుగా నిలబడుతుందనే విశ్వాసం మేము పెట్టుబడిదారులకు కల్పిస్తున్నాం" అని అన్నారు.

**స్వచ్ఛ ఇంధనం ఎగుమతి చేస్తాం**

"భారతదేశంలోనే అత్యంత పొడవైన తీరప్రాంతం, సమృద్ధిగా పునరుత్పాదక వనరులు, ప్రపంచ స్థాయి ఓడరేవులు ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఎగుమతులకు భారతదేశపు ముఖద్వారంగా మారడానికి మాకు అవకాశం కల్పిస్తున్నాయి. అతి త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తి అయ్యే స్వచ్ఛమైన ఇంధనాన్ని తీసుకువెళ్లే ఓడలు యూరప్, జపాన్, కొరియా, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తాయి. క్లీన్ మాలిక్యులస్, గ్రీన్ ఫ్యూయల్స్, సాంకేతికతలను ఎగుమతులూ ఏపీ నుంచి చేసే స్థాయికి చేరతాం.

**సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కలిసి పనిచేయాలి**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఐఐటి తిరుపతి, యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ (ఆస్ట్రేలియా) సహకారంతో సోలార్ మ్యానుఫ్యాక్చరింగ్, రెన్యువబుల్ ఎనర్జీ టెక్నాలజీల కోసం ఏర్పాటు చేస్తున్న ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కలిసి పనిచేయాలని టాటా పవర్‌ను ఆహ్వానిస్తున్నాం. మనం కలిస్తే భారతదేశపు స్వచ్ఛ ఇంధన భవిష్యత్తును నిర్మించే ఇంజనీర్లు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్తలను తయారు చేయగలం. టాటా రెన్యువబుల్ ఎనర్జీ కార్యరూపం దాల్చడానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నాను.

**సుజ్లాన్ కు ప్రత్యేక అభినందనలు**

దశాబ్దాలుగా, భారతదేశ పవన శక్తి రంగంలో సుజ్లాన్ అగ్రగామి పాత్ర పోషిస్తున్న సుజ్లాన్ పవన శక్తి ప్రాజెక్ట్ అభివృద్ధిలో భాగం కావడం ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక ఇంధన లక్ష్యాలకు గొప్ప బలాన్ని చేకూరుస్తుంది. ఈ ప్రాజెక్ట్ కోసం అవసరమైన విండ్ టర్బైన్‌లను అనంతపురంలోనే సుజ్లాన్ ఏర్పాటు చేసిన కేంద్రంలో తయారు కావడం ఏపీలో సమగ్ర పారిశ్రామిక వ్యవస్థ అభివృద్ధికి మరో నిదర్శనం. విండ్ టర్బైన్‌ల తయారీ, నిర్వహణలో యువతకు నైపుణ్య శిక్షణనిచ్చే కేంద్రాలను కూడా ఏర్పాటుచేసి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో దీర్ఘకాలిక భాగస్వామిగా నిలిచినందుకు సుజ్లాన్ యాజమాన్యం, బృందానికి కృతజ్ఞతలు.

**వజ్రాల నేల..బంగారంలాంటి ప్రజలు**

అశోకుడు పాలించిన గొప్ప నేల పత్తికొండ. పత్తికొండలో యువశక్తి అదిరిపోయింది. బంగారు గనులు ఉన్న ప్రాంతం ఇది, బంగారం లాంటి ప్రజలు ఉన్న నేల ఇది. జొన్నగిరి గోల్డ్ ఇప్పుడు ఏపీకే బ్రాండ్. పత్తికొండ బంగారం గురించి ఇప్పుడు ప్రపంచం మొత్తం మాట్లాడుతుంది. ఈ నేలలో వజ్రాలు దొరుకుతాయి, వజ్రాల లాంటి యువకులు ఇక్కడ ఉన్నారు. పెరవలి రంగనాథ స్వామి ఆలయం, పత్తికొండ సాయిబాబా ఆలయం ఉన్న పుణ్య భూమి పత్తికొండ" అని మంత్రి పేర్కొన్నారు.

**కర్నూలు ప్రజల అభిమానం మరువలేను**

"ఉమ్మడి కర్నూలు జిల్లా అంటే నాకు ఇష్టం. నేను పాదయాత్రలో వచ్చినప్పుడు ప్రజలు చూపిన ప్రేమ ఎప్పటికి మర్చిపోలేను. నేను 45 రోజులు, 14 నియోజక వర్గాల్లో పాదయాత్ర చేసాను. నాకు కర్నూలు జిల్లా ప్రజల సమస్యలు తెలుసు, కష్టాలు, వలసలు నేను చూశాను. నేను పత్తికొండ వచ్చినప్పుడు అప్పటి ప్రభుత్వం నన్ను అడ్డుకోవడానికి 1000 మంది పోలీసులను పంపింది. పత్తికొండ ప్రజలు నాకు మద్దతుగా నిలిచారు. అందుకే మీ రుణం తీర్చుకుంటున్నా. ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధిని బాధ్యతగా తీసుకున్నా. గౌరవ ముఖ్యమంత్రి గారు, నేను, మంత్రి టిజి భరత్ ప్రపంచం మొత్తం తిరిగి రాష్ట్రానికి అనేక కంపెనీలు తీసుకొస్తున్నాం. కర్నూలు జిల్లాకు కూడా అనేక పరిశ్రమలు రాబోతున్నాయి. పరిశ్రమలు తీసుకురావం మా బాధ్యత. కానీ కష్టపడి పనిచేయాల్సిన బాధ్యత యువకులపై ఉంది. కష్టం, ప్రతిభ రెండూ ఉండాలి. అప్పుడే కంపెనీలకు నమ్మకం వస్తుంది" అని అన్నారు.

**ఇండస్ట్రీ కనెక్ట్ తో నైపుణ్యాభివృద్ధి**

"నాకు ఒక వింత పరిస్థితి ఎదురవుతోంది. మేము కంపెనీ పెట్టడానికి సిద్ధంగా ఉన్నాం, మీ దగ్గర స్కిల్ ఉన్న యూత్ ఉన్నారా అని కొంతమంది పారిశ్రామికవేత్తలు అడుగుతున్నారు. అందుకే ఇప్పుడు ఐటిఐలని ఇండస్ట్రీతో కనెక్ట్ చేస్తున్నాం. ఒక్కో ఐటీఐని ఒక్కో కంపెనీకి అటాచ్ చేస్తున్నాం. ఇండస్ట్రీకి కావాల్సిన విధంగా యూత్ ని సిద్ధం చేస్తున్నాం. మొన్నే శ్రీసిటీలో యూనివర్సిటీని ప్రారంభించాను. ఇది ఇండియాలోనే నేర్చుకోండి - సంపాదించండి గ్రాడ్యుయేట్ అవ్వండి మోడల్‌లో నిర్వహించే తొలి యూనివర్సిటీ. మూడు నెలలు క్లాస్ రూములో, 8 నెలలు ఇండస్ట్రీ లో వర్క్. చదువుకుంటూనే సంపాదిస్తారు. చదువు పూర్తయ్యేసరికి ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యాలు సంపాదిస్తారు" అని లోకేష్ వ్యాఖ్యానించారు.

**దేశానికి నాయకత్వం వహించే ఏపీని నిర్మిద్దాం**

'టాటా' అనే పేరు ఎల్లప్పుడూ నమ్మకం, నిజాయితీ, దేశ నిర్మాణం, ఆవిష్కరణలకు మారుపేరుగా నిలిచిందని లోకేష్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో టాటా బంధం చాలా బలీయమైనదని అన్నారు. ప్రభుత్వం, పారిశ్రామిక రంగం, రైతులు, ప్రజలు కలిసి క్లీన్ ఎనర్జీ, పరస్పర విశ్వాసం, భాగస్వామ్య స్ఫూర్తితో కూడిన సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తున్నామని అన్నారు. భారతదేశానికి దిశానిర్దేశం చేసే ఆంధ్రప్రదేశ్‌ను, స్వచ్ఛ ఇంధన రంగంలో ప్రపంచానికే నాయకత్వం వహించే భారతదేశాన్ని మనం కలిసి నిర్మిద్దామని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో టాటా పవర్ సిఇఓ & ఎండి ప్రవీర్ సిన్హా, టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ సిఇఓ & ఎండి సంజయ్ బంగా, సుజలాన్ వైస్ చైర్మన్ గిరీష్ తంతి, భారీ పరిశ్రమల మంత్రి టిజి భరత్, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, కె.ఇ. శ్యామ్ బాబు, జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి, టాటా పవర్, సుజ్లాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాజ్యసభలోనూ బిల్లు ఆమోదం

**మొదటిపేజీ తరువాయి**

కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ మంత్రి జితేంద్ర సింగ్ ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. చర్చ సందర్భంగా ప్రభుత్వం, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడివేడీ వాదనలు జరిగాయి. పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడానికే ఈ సవరణలు తీసుకొచ్చామని ప్రభుత్వం స్పష్టం చేసింది. భారీ జరిమానాలు, ప్రత్యేక కోర్టులు, వేగవంతమైన విచారణలతో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తామని తెలిపింది. ఈ సవరణల ప్రకారం పేపర్ లీక్‌లకు పాల్పడిన వారిపై గరిష్ఠంగా రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. జైలు శిక్షతో పాటు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో విచారణ పూర్తి చేసే నిబంధనలను కూడా చేర్చారు. పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడే ముఠాలపై మరింత కఠినంగా వ్యవహరించేందుకు ఈ మార్పులు ఉపయోగపడతాయని ప్రభుత్వం పేర్కొంది. 2024లో తీసుకొచ్చిన చట్టం అమలులో వచ్చిన అనుభవాల ఆధారంగానే ఈ సవరణలు రూపొందించినట్లు జితేంద్ర సింగ్ తెలిపారు. ఆ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని చెప్పారు. పేపర్ లీక్‌ల కారణంగా ఆత్మహత్యల సంఖ్య కూడా తగ్గిందని సభకు వివరించారు. అయితే ప్రతిపక్షం మాత్రం బిల్లుపై విమర్శలు గుప్పించింది. కేవలం శిక్షలు పెంచడం సరిపోదని, పరీక్షల నిర్వహణ వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు అవసరమని డిమాండ్ చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరుపైనా ప్రశ్నలు లేవనెత్తింది. మరోవైపు విద్యార్థుల ప్రయోజనాల కోసం కేంద్రం వేగంగా చర్యలు తీసుకుందని అధికార పక్షం పేర్కొంది. మాజీ విద్యాశాఖ మంత్రి రాజీనామా, నందన్ నీలేకని నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించడం వంటి చర్యలను ప్రస్తావించింది.

# బీజేపీలో చేరకపోతే.. అంతు చూస్తామన్నారు

**మొదటిపేజీ తరువాయి**

మీడియాతో మాట్లాడారు. "సీజేపీ ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఉద్యమం నిర్వహించిన సమయంలో.. బీజేపీలో చేరాలంటూ నాపై నిరంతరం ఒత్తిళ్లు వచ్చాయి. లేదంటే నాతోపాటు, నా కుటుంబం అంతు చూస్తామని బెదిరించారు"అని దీప్కే బయటపెట్టారు. దేశంలో అత్యున్నత స్థాయిలో ఉన్న వారు తనలాంటి ఓ విద్యార్థిని అలా బెదిరించడం సిగ్గుచేటన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపైనా విమర్శలు కురిపించారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేస్తుండడాన్ని ఏద్దేవా చేశారు. "ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్రభావశీలిగా (ఇన్‌ఫ్లూయెన్సర్) బాగా రాణిస్తున్నారు. ఆయన ప్రధాని కుర్చీని ఖాళీ చేసి, పూర్తిస్థాయి సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మారిపోవాలి. దేశాన్ని పాలించే అధికారం మరో నాయకుడికి అప్పగించాలి"అని దీప్కే సూచించారు. ఇక, ఆందోళనను విరమించిన తర్వాత కూడా విద్యార్థులకు వేధింపులు కొనసాగుతున్నాయంటూ దీప్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనల్లో పాల్గొన్న వారిని రాష్ట్ర ప్రభుత్వాలు వేధిస్తున్నాయని.. ఈ చర్యలను ఆపకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. "విద్యార్థులు ఉగ్రవాదులు కారు. వారు మన దేశ భవిష్యత్. దేశ భవిష్యత్ ఇబ్బందుల్లో పడితే చూస్తూ ఊరుకోం. ప్రభుత్వాన్నే మార్చేస్తాం. వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతాం"అని అన్నారు. విద్యార్థులపై లాఠీచార్జ్, పెల్లెట్ గన్లను వాడడం వెనుక అమిత్‌షా ప్రమేయం ఉందని దీప్కే ఆరోపించారు. ఢిల్లీ పోలీసులు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కిందే పనిచేస్తారని, విద్యార్థులపై దాడులకు ఆదేశాలిచ్చిన అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తీవ్రవాదులపై ఉపయోగించే ఆయుధాలు, ఏకే47లను విద్యార్థులపై ప్రయోగించారని, ఈ దాడిలో పలువురు విద్యార్థులు కంటిచూపు కూడా కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర విద్యా మంత్రి పదవిని ప్రహ్లాద్ జోషికి అప్పగించడంపైనా స్పందించారు. రేపిస్టులను ఆహ్వానించే వ్యక్తిని విద్యామంత్రిగా నియమిస్తున్నారంటూ.. బీజేపీ ప్రభుత్వం ఎప్పుడూ రేపిస్టులు, నేరగాళ్లకు మద్దతుగా నిలుస్తోందని తీవ్రమైన విమర్శ చేశారు. బీజేపీ ఎంపీ, బాలీవుడ్ నటి కంగన రనౌత్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఆమెను తానొక సీరియస్ రాజకీయ నేతగా చూడడం లేదన్నారు. 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు, 2026' పేపర్‌లీక్‌కు కారకులైన నిందితులను శిక్షించడానికే పరిమితమైంది తప్పించి, అసలు పేపర్‌లీక్‌ను నివారించడంపై దృష్టి పెట్టలేదని సీజేపీ అధికార ప్రతినిధి అశుతోష్ రంకా విమర్శించారు. తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే, మళ్లీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# ఉపాధ్యాయులదే భావితరం బాధ్యత

**మొదటిపేజీ తరువాయి**

సరిదిద్దామని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్ కోసం పూర్తిగా అంకితం కావాలని ఆకాంక్షించారు. ఫిన్‌లాండ్, జర్మనీ దేశాల్లో ఇటీవల పర్యటించి వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో గురువారం హైదరాబాద్ లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఆయన ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిగా తనను వైదొలగాలని కొందరు కోరుతున్నారనీ, అయితే దానికిగల కారణాలు కూడా వారే చెప్పాలన్నారు. "విద్యార్థులకు నర్సరీ నుంచి ఇంటర్ వరకు బ్రేక్ ఫాస్ట్, లంచ్ ఇస్తున్నందుకా?, టీచర్ల నియామకాలు, పదోన్నతులు నిర్వహించినందుకా?, ఐటీఐలను ఏటీసీలుగా మార్చి, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినందుకా?.. ఎందుకు నేను రాజీనామా చేయాలో చెప్పాలి" అని అడిగారు. తాను విద్యాశాఖను జిజ్ఞాసతో దగ్గర పెట్టుకున్నానని చెప్పారు. ఎల్‌కేజీ పిల్లలకు ఓట్లు ఉండవని చమత్కరించారు. గత ప్రభుత్వంలో మాదిరిగా రెవెన్యూ, ఆర్థిక, సాగునీరు వంటి కీలక శాఖలు తన వద్ద లేవని అన్నారు. భవిష్యత్ తరాన్ని ఉత్తమంగా, ఉన్నతంగా తీర్చిదిద్దడమే ఆ శాఖ మంత్రిగా తన బాధ్యత అని స్పష్టంచేశారు.

**డిసెంబర్‌లోగా విద్యాభివృద్ధి నివేదిక ఇవ్వండి**

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఇంకా ఏం చేయాలో సూచించాలని ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా కోరారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఏం చేస్తే బాగుంటుందో డిసెంబరులోగా నివేదిక రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. ప్రతి మండలాన్ని ఒక క్లస్టర్ గా ఏర్పాటు చేసి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. సమాజంలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు విద్య పునాదిగా పని చేస్తుందన్న తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వ్యాఖ్యలను సీఎం గుర్తు చేశారు. అందుకే విద్య రంగానికి, కరువును పారదోలేందుకు సాగునీటిపారుదలకు నెహ్రూ ప్రాధాన్యతనిచ్చారని తెలిపారు. ఆయన దూరదృష్టితోనే నేడు తెలంగాణ 2 కోట్లా 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని ఉత్పత్తి చేయగలిగిందని తెలిపారు. హరిత విప్లవం, పంచవర్ష ప్రణాళికలు తెచ్చిన నాయకులు ఎవరో ప్రజలకు తెలుసునని వ్యాఖ్యానించారు.

**నాటి గురుకులాలే నేటి 'నవోదయాలు'**

మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు ఏర్పాటు చేసిన గురుకులాలే నేటి నవోదయ విద్యాలయాలకు స్ఫూర్తి అని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆనాటి నాయకులు తెచ్చిన సంస్కరణలతో విద్య అందిందనీ, ఆకలి తీరిందని వివరించారు. కానీ నేటి ప్రపంచంతో పోటీ పడాలంటే అది సరిపోదని తెలిపారు. ప్రతీ పేదవాడిని ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దాలనీ, నాణ్యమైన విద్య, పౌష్టిక ఆహారం అందిచడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఆ దిశగా తెలంగాణను తీర్చి దిద్దే ప్రతినిధులు ఉపాధ్యాయులేనని అన్నారు. వెనకబాటుతనానికి ఆస్తులు, అంతస్తులతో సంబంధం లేదనీ, విద్య లేకపోవడమే అసలైన వెనకబాటుతనమని ముఖ్యమంత్రి తెలిపారు.

**విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి**

ఒక్కో విద్యార్థిపై రాష్ట్ర ప్రభుత్వం రూ.1.8 లక్షలు ఖర్చు చేస్తున్నాడ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రయివేటు స్కూళ్లకే ఎందుకు పంపుతున్నారో ఆలోచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. తల్లిదండ్రులు ఒక్కో పిల్లవాడిపై ఏడాదికి సుమారు రూ.50 వేలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. అయితే తమ ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా ఈ యేడాది సర్కారు బడుల్లో లక్ష మంది విద్యార్థులు అదనంగా చేరారని చెప్పారు. విద్యతోపాటు నైపుణ్యాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇంగ్లీష్ ఒక్కటే ముఖ్యమనుకుంటే చైనా ప్రపంచాన్ని ఎలా శాసిస్తోంది? అని సీఎం ప్రశ్నించారు.

## తెలంగాణ జలాశయాలకు పోటెత్తుతున్న వరద.

**మొదటిపేజీ తరువాయి**

వివిధ జలాశయాల ప్రస్తుత పరిస్థితి వివరాలు:
జూరాల ప్రాజెక్టు (మహబూబ్‌నగర్):
ఇన్‌ఫ్లో: 91,000 క్యూసెక్కులు. ఔట్‌ఫ్లో: 81,695 క్యూసెక్కులు (10 గేట్లు ఎత్తివేత).
నీటిమట్టం: గరిష్ఠంగా 318.516 మీటర్లకు గాను ప్రస్తుతం 317.35 మీటర్లకు చేరింది.
నీటి నిల్వ: పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.371 టీఎంసీలు నమోదైంది. ఎగువ, దిగువ విద్యుత్ కేంద్రాల్లోని 11 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.
భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి:
ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం నీటిమట్టం 27.4 అడుగులకు చేరడంతో తీరప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.
శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ (నిజామాబాద్):ఇన్‌ఫ్లో: 6,250 క్యూసెక్కులు.నీటిమట్టం: పూర్తిస్థాయి 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1065 అడుగులు ఉనంది. 80 టీఎంసీల సామర్థ్యానికి గాను 16 టీఎంసీల నిల్వ ఉంది.నిజాంసాగర్ ప్రాజెక్ట్ (నిజామాబాద్):ఇన్‌ఫ్లో: 3,935 క్యూసెక్కులు.నీటిమట్టం: పూర్తిస్థాయి 1405 అడుగులకు గాను ప్రస్తుతం 1395.83 అడుగులకు చేరింది. 17.802 టీఎంసీల సామర్థ్యానికి గాను 7.146 టీఎంసీల నీరు నిల్వ ఉంది (గత ఏడాది ఇదే సమయానికి 4.622 టీఎంసీలుగా ఉంది).సింగూరు ప్రాజెక్టు (సంగారెడ్డి):
ఇన్‌ఫ్లో: 517 క్యూసెక్కులు. ఔట్‌ఫ్లో: 470 క్యూసెక్కులు.
నీటి నిల్వ: 29.9 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను ప్రస్తుతం 4.249 టీఎంసీల నీటి నిల్వ నమోదైంది

## వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు

**మొదటిపేజీ తరువాయి**

అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం రెవెన్యూ, విపత్తు నిర్వహణ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో గడచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, రాబోయే రెండు రోజుల్లో కురిసే వర్షాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. వాగులు, వంకలు, చెరువులు, జలాశయాల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలి. ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తూ, అవసరమైతే వెంటనే సురక్షిత ప్రాంతాలు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే తక్షణమే స్పందించి సహాయక చర్యలు అందించాలని సూచించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రవాణా, విద్యుత్, తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలి. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా(హైడ్రా, జిహెచ్ ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సాధారణ జీవనానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగు రోజుల క్రితం వరకు రాష్ట్రంలో 30శాతం మేర ఉన్న వర్షపాతం లోటు, గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో భర్తీ అయి దాదాపు సాధారణ స్థాయికి చేరుకుందని మంత్రి తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వివిధ జిల్లాలకు అలర్ట్‌లు జారీ అయ్యాయని మంత్రి తెలిపారు. ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశామని అలాగే నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామని తెలిపారు. వచ్చే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

## బస్ టికెట్‌తో పాటే ఆటో బుకింగ్..

**మొదటిపేజీ తరువాయి**

ఈ చర్చలు కొలిక్కి వచ్చిన వెంటనే ఈ-ఆటోలు రోడ్డెక్కనున్నాయి.

ఈ కొత్త విధానంలో ప్రయాణికులు తమ బస్ టికెట్‌ను బుక్ చేసుకునే సమయంలోనే అదనంగా ఆటో రైడ్‌ను కూడా ఒకేసారి బుక్ చేసుకునేలా ప్రత్యేక సౌకర్యం కల్పించనున్నారు. దీని ద్వారా ప్రయాణికులను వారి నివాసం నుంచి సమీప బస్ పాయింట్‌కు, అలాగే బస్సు దిగిన తర్వాత అక్కడి నుంచి వారి చివరి గమ్యస్థానానికి ఈ-ఆటోలు సురక్షితంగా చేరవేస్తాయి. ఫలితంగా ప్రయాణికులకు విలువైన సమయం ఆదా అవడంతో పాటు బస్టాప్‌లకు చేరుకోవడానికి, అక్కడి నుంచి గమ్యస్థానాలకు వెళ్లడానికి పడే ప్రయాసలు తప్పుతాయి. ఈ ఎలక్ట్రిక్ ఆటో సేవలను ప్రయోగాత్మకంగా తొలుత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఇక్కడ లభించే స్పందన, ఫలితాల ఆధారంగా రెండో దశలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ వంటి రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాలకు దశలవారీగా విస్తరించాలని యోచిస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం నగరంలో అధిక ఛార్జీలతో నడుస్తున్న ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి ప్రైవేట్ రైడ్ హెయిలింగ్ యాప్‌ల కన్నా గణనీయంగా తక్కువ ఛార్జీలతో ఈ సేవలను అందించేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ నిర్ణయం వల్ల హైదరాబాద్ శివారు ప్రాంతాలైన ఎల్బీనగర్, ఉప్పల్, మియాపూర్, పటాన్‌చెరు, శంషాబాద్, ఘట్‌కేసర్ వంటి కనెక్టివిటీ సమస్యలున్న ప్రాంతాల ప్రజలకు గొప్ప ఊరట లభించనుంది. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆర్టీసీ ఈ-ఆటోల నిర్ణయం ఒక మైలురాయిగా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# బీసీ ఉద్యోగులపై వేధింపులను ఆపాలి



**హిమాయత్ నగర్,(ప్రజా వినికిడి):**
బీసీ ఉద్యోగులపై రోజురోజుకు వేధింపులకు గురిచేస్తూ, ఉద్యోగులను మానసికంగా వేధిస్తూ అక్రమ కేసులను బనాయిస్తున్నారని బీసీ సంఘాల నేతలు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్,బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్,బిసి జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ మాట్లాడుతూ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు రిజర్వేషన్లు ఇవ్వకుండా, పోస్టింగులలో ప్రాధాన్యత ఇవ్వకుండా, మానసికంగా వేధిస్తూ తోటి ఉద్యోగులతో కించపరిచే విధంగా చేస్తున్నటువంటి అధికారులపై బలహీన వర్గాల సంబంధించినటువంటి ఉద్యోగులను మానసికంగా వేధిస్తూ అక్రమ కేసులను పెట్టి సస్పెన్షన్ చేసి ఏ కారణం లేకుండా సస్పెండ్ చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.
మొన్ననే హైదరాబాదులో మలక్పేట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా పని చేస్తున్నటువంటి నరసింహ గౌడ్ ను అకారణంగా ఒక మహిళా కానిస్టేబుల్ ను వేధిస్తున్నాడనే తప్పుడు ఆరోపణలు పెట్టి సస్పెండ్ చేయడం జరిగింది,ఇది చాలా బాధాకరమైనటువంటి విషయం, కానీ అసలు విషయానికి వస్తే ఒక మహిళా అడ్వకేటు అతనిపై కంప్లీట్ చేసి కావాలనే రాద్ధంతం చేస్తూ వారి సస్పెండ్ కు కారణమైంది, గౌరవ సిపి సజ్జనార్ ఈ విషయం పైన లోతుగా పరిశీలించి, ఏతప్పు చేయనటువంటి అధికారినినీ,
ఏ కారణం లేకుండా తప్పుడు ఆరోపణలతో సిఐని సస్పెండ్ ఉత్తర్వులు ఇచ్చారు, ఇప్పటికైనా లోతుగా పరిశీలించి వారి సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు.
ఫిర్యాదు చేసినటువంటి అడ్వకేట్ వివిధ డిపార్ట్మెంట్లో ఇప్పటి వరకు 50 మంది పైన కేసులు వేసి అధికారులను మానసికంగా హింసిస్తూ బెదిరింపులు చేస్తున్నటువంటి ఆ వ్యక్తి పైన చర్యలు తీసుకోవాల్సింది పోయి నిజాయితీగా పనిచేస్తున్నటువంటి ఓ అధికారి పైన సస్పెండ్ చేయడం చాలా బాధాకరమైన విషయం.సీపీ ఈ విషయంపై ఇప్పటికైనా స్పందించి అధికారులపై పెట్టినటువంటి కేసులను వివిధ పోలీస్ స్టేషన్లో 50కి పైగా ఉన్నాయి, హైదరాబాద్ లో ఏ పోలీస్ స్టేషన్ చూసిన ఆమె కేసులు వేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తు, అధికారులపై తప్పుడు ఆరోపణలు చేస్తూన ఆమె పైన వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ
కార్యక్రమంలో బిసి యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్ గౌడ్,బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు ఇంద్రం రజక, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు తొడుపునూరి సత్యం గౌడ్, గుంటి మహేష్ మీరు,బండిగారి రాజు తదితరులు పాల్గొన్నారు.

# క్రిప్ట్యూషన్ ను ప్రారంభించిన బిట్‌డెల్టా ఇండియా




**హిమాయత్ నగర్,(ప్రజా వినికిడి):**
భారతదేశపు తొలి నిర్మిత క్రిప్టో ఆస్తుల అభ్యాసం, సర్టిఫికేషన్ ఎకోసిస్టమ్ లో రిజిస్టర్ అయిన వర్చువల్ డిజిటల్ అసెట్ ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్ అయిన బిట్‌డెల్టా ఇండియా నేడు భారతదేశపు తొలి ఇన్‌స్టిట్యూషన్-గ్రేడ్ క్రిప్టో ఆస్తుల లెర్నింగ్ సర్టిఫికేషన్ ఎకోసిస్టమ్ అయిన క్రిప్ట్యూషన్ ప్రారంభాన్ని ప్రకటించింది.
క్రిప్ట్యూషన్, అవగాహనతో కూడిన సిద్ధమైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా భారతదేశ విడిఏ ఎకోసిస్టమ్ వృద్ధికి మద్దతు అందించే లక్ష్యంతో అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. క్రిప్టో ఆస్తులు వాటికి సంబంధించిన సమాచారానికి ప్రాప్యత విస్తరించినప్పటికీఅధికారిక విద్యా వ్యవస్థ అదే స్థాయిలో అభివృద్ధి చెందలేదు.దీని ఫలితంగా,అనేక మంది భాగస్వాములు విభిన్నమైన వనరుల ద్వారా సంక్లిష్టంగా నిరంతరం మారుతున్న మార్కెట్‌ను అర్థం చేసుకోవాల్సి వస్తోందనీ పేర్కొంది.ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు లైవ్-మార్కెట్ వాతావరణాలకు మారే ముందు మార్గదర్శక అభ్యాసం, సిమ్యులేటెడ్ మార్కెట్ అనుభవం సామర్థ్య ఆధారిత సర్టిఫికేషన్‌ను సమన్వయం చేయడం ద్వారా ఈ లోటును పూడ్చాలని లక్ష్యంగా పెట్టుకుందనీ పేర్కొన్నారు.

# రాజేంద్రనగర్ జోన్ పరిధిలో గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం

## పాల్గొన్న ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్..






**రాజేంద్రనగర్,(ప్రజావినికిడి):**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) పరిధిలోని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో రానున్న గణేష్ ఉత్సవాలను (2026) పురస్కరించుకుని గురువారం రోజు కీలక సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసిపాల్గొన్నారు.ఈ సందర్భంగా రానున్న వినాయక చవితి ఉత్సవాలు,మరియు నిమజ్జన కార్యక్రమాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా,
ప్రశాంతవాతావరణంలోవిజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ,
గణేష్ ఉత్సవాలు సజావుగా సాగేందుకు జీహెచ్ఎంసీ, పోలీసు,విద్యుత్,రెవెన్యూ, మరియు జలమండలి తదితర అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సూచించారు.వినాయక మండపాలు ఏర్పాటు చేసుకొనే ప్రాంతాలు,అలాగే నిమజ్జన ఊరేగింపు సాగే మార్గాలలో రోడ్లమరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని,పారిశుద్ధ్య నిర్వహణ పటిష్టంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

## నవజాత శిశువుకు అరుదైన అండాశయ సిస్టుకు

# విజయవంతమైన శస్త్రచికిత్స

**సకాలంలో సరైన చికిత్సతో శిశువును కాపాడిన మలక్ పేట్ యశోదా హాస్పిటల్ వైద్యులు**




**శంషాబాద్, (ప్రజావినికిడి): జూలై 30:** గర్భధారణ సమయంలో లేదా పుట్టిన వెంటనే శిశువులలో పొత్తికడుపులో కనిపించే కొన్ని గడ్డలు అరుదైన పుట్టుకతో వచ్చే వ్యాధులకు సంకేతాలు కావచ్చు. వాటిలో నవజాత శిశువుల అండాశయ సిస్ట్ (నియోనాటల్ ఓవరిన్ సిస్ట్) ఒకటి. గర్భధారణ సమయంలో తల్లి హార్మోన్ల ప్రభావంతో కొంతమంది ఆడ శిశువుల్లో ఈ సమస్య ఏర్పడుతుంది. చిన్న సిస్టు చాలాసార్లు స్వయంగా తగ్గిపోతాయి. అయితే పెద్ద సిస్టు ఉంటే అండాశయం మెలిక తిరగడం పగిలిపోవడం, రక్తస్రావం, ఇన్ఫెక్షన్, అండాశయం శాశ్వతంగా దెబ్బతినడం వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. అందుకే సకాలంలో గుర్తించి నిపుణులైన వైద్యులతో చికిత్స అందించడం అత్యంత కీలకం. ఇటీవల యశోదా హాస్పిటల్స్, శంషాబాద్ వైద్యులు పుట్టుకతోనే ఎడమ అండాశయంలో పెద్ద సిస్ట్తో జన్మించిన ప్రీటర్మ్ ఆడ శిశువుకు విజయవంతంగా చికిత్స అందించారు. నిపుణులైన వైద్యులు నిర్వహించిన అల్ట్రాసౌండ్ పరీక్షల్లో పొత్తికడుపులో పెద్ద పరిమాణంలో ఉన్న ఎడమ అండాశయ సిస్ట్ ఉన్నట్లు నిర్ధారించారు. భవిష్యత్తులో తలెత్తే తీవ్రమైన సమస్యలను నివారించడంతో పాటు అండాశయాన్ని సంరక్షించాలనే లక్ష్యంతో బహుళ విభాగాల వైద్యుల బృందం శస్త్రచికిత్స నిర్వహించాలని నిర్ణయించింది. నవజాత శిశువుకు అత్యాధునిక శస్త్రచికిత్స కన్సల్టెంట్ పీడియాట్రిషియస్ &
నియోనాటాలజిస్ట్ డా.ప్రశాంత్ బాబు బి. నేతృత్వంలో శిశువుకు లాపరోటమీ ద్వారా అండాశయ సిస్టు మార్పుపియలైజేషన్ శస్త్రచికిత్సను జనరల్ అనస్థీషియా కింద విజయవంతంగా నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం శిశువుకి వైద్య నిపుణుల పర్యవేక్షణలో పర్రవేక్షణలో సమగ్ర వైద్య సేవలను అందించారు. సకాలంలో స్పందించి చికిత్స అందించడంతో శిశువు ఆరోగ్యంగా కోలుకుంటుంది. నవజాత ఆడ శిశువుల్లో పెద్ద అండాశయ సిస్టు అరుదుగా కనిపించడం సహజం అయితే సరైన సమయంలో గుర్తించి చికిత్స అందిస్తే పూర్తి ఆరోగ్యంగా కోలుకుంటారని డాక్టర్ ప్రశాంత్ బాబు కన్సల్టెంట్ పీడియాట్రిషియస్ నియోనాటాలజిస్ట్ యశోద హాస్పిటల్ మలక్పేట్ వారు తెలిపారు. మలక్పేట్ యశోద ఆస్పత్రి యాజమాన్యం స్పందిస్తూ... గర్భధారణ సమయంలో నిర్వహించే స్కానింగ్ పుట్టిన వెంటనే శిశు పరీక్షల ద్వారా లోపాలు గుర్తించి చికిత్స అందించడం మంచిదని యశోద ఆస్పత్రి యాజమాన్యం శంషాబాద్ యాజమాన్యం తెలిపింది.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్ గోరకంటి పవన్, యూనిట్ట్ హెడ్ శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ, అత్యాధునిక ఇమేజింగ్ సదుపాయాలు నియోనేటల్ ఇంటెన్సీ కేర్ అనుభవజ్ఞులైన పీడియాట్రిక్ సర్జన్లు నియనాలటిస్టులు అనస్తీషియా నీ పనులు ఇతర విభాగాల సమన్వయంతో నవజాత శిశువుకు ప్రపంచ స్థాయి వైద్య సేవలను యశోద హాస్పిటల్స్ అందిస్తుందని అన్నారు.

# నాగోల్ పీఎస్‌కు ఇద్దరు ఎస్సైలు




**నాగోల్,(ప్రజావినికిడి):**
నాగోల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన సబ్ ఇన్‌స్పెక్టర్లు సూర్య నాయక్, మమతారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ సమక్షంలో వారు రిపోర్ట్ చేయగా, విధుల బాధ్యతలను అప్పగించారు. 2014 బ్యాచ్‌కు చెందిన సూర్య నాయక్ గతంలో చిక్కడపల్లి, బేగంపేట, తిరుమలగిరి, హయత్‌నగర్ పోలీస్ స్టేషన్లతో పాటు మల్కాజిగిరి ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహించారు. రోడ్డు భద్రత విభాగానికి బదిలీ అయిన ఎస్సై వేణుగోపాల్ స్థానంలో 2024 బ్యాచ్‌కు చెందిన మమతారెడ్డి జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ నుంచి నాగోల్‌కు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఇద్దరు అధికారులను సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ అభినందించి, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేలా విధులు నిర్వహించాలని సూచించారు.

# విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో లేజర్ బీమ్ స్కై బీమ్ లైట్ల వినియోగంపై నిషేధం

**విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లోని సుమారు 70 కన్వెన్షన్ హాళ్లు నిర్వాహకులు అవగాహన**

**ఐపీఎస్, అదనపు పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ ఐపీఎస్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ బి.రాజేష్**







**శంషాబాద్, (ప్రజావినికిడి): జూలై 30,** విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో లేజర్ బీమ్,స్కై బీమ్ లైట్ల వినియోగంపై నిషేధం విధించడం జరిగిందని ఐపీఎస్, అదనపు పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ తెలిపారు.రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో విమానాల సురక్షిత రాకపోకలకు విఘాతం కలిగించే లేజర్ బీమ్ లైట్లు,స్కై బీమ్ లైట్లు,సెర్చ్ లైట్లు,మూవింగ్ బీమ్ లైట్లు ఇతర అధిక తీవ్రత గల కాంతి పరికరాల వినియోగాన్ని 30 జూలై నుండి అమలు చేయడానికి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయం, శంషాబాద్ నందు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తఫ్సీర్ ఇక్బాల్, ఐపీఎస్, అదనపు పోలీసు కమిషనర్ (లా అండ్ ఆర్డర్), హైదరాబాద్ అధ్యక్షత వహించగా,బి. రాజేష్,ఐపీఎస్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, శంషాబాద్, ప్రదీప్ రెడ్డి, సహాయ పోలీసు కమిషనర్, ఆదిభట్ల,వి. శ్రీకాంత్ గౌడ్, సహాయ పోలీసు కమిషనర్, శంషాబాద్, జీఎంఆర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జీఎంఆర్ ఎయిర్‌సైడ్ భద్రతా విభాగ అధికారుల సమక్షంలో కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సమావేశానికి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లోని సుమారు 70 కన్వెన్షన్ హాళ్లు, ఫంక్షన్ హాళు ,, బ్యాంక్వెట్ హాళ్లు, ఫామ్ హౌస్‌ల యజమానులు, నిర్వాహకులు హాజరై విమాన భద్రతకు సంబంధించిన నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఆకాశం వైపు ప్రసరించే లేజర్ బీమ్ లైట్లు,స్కై బీమ్ లైట్లు,సెర్చ్ లైట్లు,మూవింగ్ బీమ్ లైట్లు, ఇతర అధిక తీవ్రత గల కాంతి పరికరాలు విమాన చోదకుల దృష్టిని మరల్చడంతో పాటు తీవ్ర కాంతి ప్రతిఫలన కు కారణమై, విమానాల టేకాఫ్,అప్రోచ్ మరియు ల్యాండింగ్ ప్రక్రియలకు అంతరాయం కలిగించి,విమాన భద్రతకు తీవ్రమైన ముప్పును కలిగించే అవకాశం ఉన్నదని వివరించారు.ఈ సందర్భంగా నిర్వాహకులకు క్రింది సూచనలు చేశారు లేజర్ బీమ్ లైట్లు,స్కై బీమ్ లైట్లు,సెర్చ్ లైట్లు,మూవింగ్ బీమ్ లైట్లు లేదా ఆకాశం వైపు ప్రసరించే ఇతర అధిక తీవ్రత గల కాంతి పరికరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదు.తమ ప్రాంగణాల్లో ఏర్పాటు చేసే లైటింగ్ వ్యవస్థలు విమానాల రాకపోకలకు ఎటువంటి ఆటంకం కలిగించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.ఈ నిబంధనలను ఈవెంట్ నిర్వాహకులు, డెకరేటర్లు, డీజేలు,లైటింగ్ కాంట్రాక్టర్లకు తప్పనిసరిగా తెలియజేయవలెను.
పోలీసు శాఖ, విమానాశ్రయ అధికారులు, సీఐఎస్ఎఫ్, డీజీసీఏ లేదా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఆదేశించిన వెంటనే ఇటువంటి కాంతి పరికరాల వినియోగాన్ని నిలిపివేయవలెను.నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్, 1937లోని రూల్-66, డీజీసీఏ సివిల్ ఏవియేషన్ రిక్వైర్మెంట్స్ (కార్),సెక్షన్-4 (ఏరోడ్రోమ్స్), సిరీస్-బి, పార్ట్-×, పేరా-5.3.1.2, అలాగే భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), 2023లోని సెక్షన్లు 125,223 అలాగే 283తో పాటు వర్తించే ఇతర చట్టాల ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు.విమాన భద్రత దృష్ట్యా రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లోని కన్వెన్షన్ హాళ్లు, ఫంక్షన్ హాళ్లు, బ్యాంక్వెట్ హాళ్లు, రిసార్టులు,ఫామ్ హౌస్‌లు, ఈవెంట్ నిర్వాహకులు, డెకరేటర్లు, డీజేలు,లైటింగ్ కాంట్రాక్టర్లు అందరూ ఈ నిబంధనలను విధిగా పాటించి, సురక్షిత విమాన రాకపోకలకు తమ వంతు సహకారం అందించాలని హైదరాబాద్ పోలీసు శాఖ విజ్ఞప్తి చేశారు.

# ప్రజలందరికీ ఉపయోగకరంగా ఉన్న రాంలీలా మైదానంను మరింత అభివృద్ధి చేస్తాం

## : బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్..



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
130 - సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీ "శ్రీ రాంలీలా మైదానం" నూతన కమిటీ కార్యవర్గం సభ్యులు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ ఆధ్వర్యంలో పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి రామ్ లీలా మైదానంలో నిరుపయోగంగా ఉన్న బోరుకు మోటారుకు బిగించడంతో పాటు విద్యుత్ సదుపాయాన్ని కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ నూతన కమిటీ అధ్యక్షులైన కొట్టే రవి,ప్రధాన కార్యదర్శి అయిన కొత్తకొండ రవిలను శాలువాతో సత్కరించారు.అనంతరం వారు మాట్లాడుతూ, సాంస్కృతిక కార్యక్రమాలకు, పండుగలకు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న శ్రీ రామ్ లీలా మైదానములను అభివృద్ధి చేసేందుకు కమిటీ సభ్యులకు నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు.
ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు ధారం సాయికుమార్, మాణిక్య రెడ్డి, జాయింట్ సెక్రెటరీ మాసిరెడ్డి, శ్రీనివాస్,సెక్రటరీ లక్ష్మణ్, గోవిందప్ప, ఆర్గనైజింగ్ సెక్రటరీలు శ్రావణ్ కుమార్,వీరన్న, భాస్కర్ రెడ్డి, సభ్యులు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలి.. -గుబ్బల లక్ష్మీనారాయణ



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** సుభాష్ నగర్ డివిజన్ ఎస్సార్ నాయక్ నగర్ లోని జనప్రియ అపార్ట్మెంట్స్ నందు ఎస్ఐఆర్ లో భాగంగా ప్రతి ఒక్కరూ ఏమ్యురేషన్ ఫామ్ ను నింపి బిఎల్ఓ లకు అందజేయాలని సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ అన్నారు.అర్హత కలిగిన ప్రతి ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని అన్నారు.ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కాపాడుకోవాలని ఇంకా ఫారం నింపి ఇవ్వనివారు తొందరగా ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ బి ఎల్ఏ భీమరాజు, అడబాల వెంకటరత్నం, బిఆర్ఎస్ బి ఎల్ ఏ సోమేశ్వరరావు , బిఎల్ఓలు మహాలక్ష్మి , ప్రవీణ,ఎస్ఐఆర్ అసిస్టెంట్ సూపర్వైజర్ రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫరూఖ్‌నగర్ యాదవ కాలనీ బోనాల ఊరేగింపులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ శ్రేణులు



**షాద్‌నగర్,జులై 30,(ప్రజా వినికిడి):**షాద్ నగర్ పట్టణంలోని ఫరూఖ్‌నగర్ యాదవ కాలనీలో నిర్వహించిన బోనాల ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపులో భక్తులతో కలిసి పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల ఉత్సవాలను భక్తి,ఐక్యతతో నిర్వహించడం ఆనందదాయకమని ఆయన పేర్కొన్నారు.అమ్మవారి కరుణాకటాక్షాలు రాష్ట్ర, నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని,ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్,మాజీ మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, కౌన్సిలర్లు పిల్లి శారద శేఖర్, గోపాల్,ఎస్పీ శివ, మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి, యుగంధర్,చిన్న యాదగిరి, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్,చీపిరి రవి యాదవ్, బిక్షపతి,చెర్క శివ,అశోక్,బాబా ఘోరీ,మహమూద్, నవీన్,సాయి,అభిలాష్,శ్రీనివాస్ తదితరులు,కాలనీ పెద్దలు, మహిళలు,యువకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమ వెంచర్ కు అధికారుల అండదండలు..

**ఎఫ్ టి ఎల్ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ లకు (ఎన్ ఒ సీ)లు జారీ చేసిన ఇరిగేషన్,రెవిన్యూశాఖఅధికారులు..**

**రాయికల్ గ్రామంలోని ఊర చెరువుకు అనుకొనిఉన్నసంజీవని వెంచర్..**

**వెంచర్ లో ఉన్న పాటు కాలువను రాళ్లు,మట్టితో పూడ్చివేసి రోడ్డు నిర్మాణం చేపట్టిన వైనం..**

**ఉర చెరువు లోకి వెళ్లే కాలువను పరిశీలన చేస్తున్న:షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే,టిడిపి పోలీట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు..**

**అధికారుల నిర్లక్ష్యంపై మాజీ ఎమ్మెల్యే ఫైర్..**




**షాద్ నగర్,జులై 30,(ప్రజా వినికిడి):**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫారుక్ నగర్ మండలం రాయికల్ గ్రామంలో సర్వే నెంబర్ 258లో (4.10)నాలుగు ఎకరాల పది గుంటల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఊర చెరువు అనుకొని ఉన్న సర్వేనెంబర్ 257 లో 1ఎకరా.3 మూడు గంటలు భూమి ఎఫ్ టి ఎల్,బఫర్ జోన్ లో ఉండగా వెంచర్ నిర్వాహకులకు ఇరిగేషన్ శాఖ అధికారులు (ఎన్ వో సి)జారీ చేసిన వైనం.రాయికల్ గ్రామంలోని సర్వేనెంబర్ 249,250లో నుండి పాటు కాలువ బాక్స్ కల్వర్ ఎన్ హెచ్ 44 రోడ్డు అవతలి వైపు నుండి ఊర చెరువులోకి నీరు వచ్చి చేరే కాలువను రాళ్లు,మట్టితో పూడ్చివేసి రోడ్డునిర్మాణం చేపట్టిన "సంజీవని ప్రాజెక్టు వెంచర్" నిర్వాహకులు.

**అక్రమ వెంచర్ కు జి హుజూర్ అంటున్న అధికారులు**

ఫారుక్ నగర్ మండలంలోని రాయికల్ గ్రామలో ఉన్న ఊర చెరువుని చెరపెట్టిన వైనం గ్రామ శివారులోని సర్వేనెంబర్247,248,249,250,251,252,257,లలో అక్రమంగా నిర్మించిన "సంజీవని వెంచర్"కు అధికారుల పూర్తి మద్దతు ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.వెంచర్ నిర్వాహకుల ద్వారా పెద్ద మొత్తంలో ముడుపులు ముట్టినట్లు,అందుకే సమాధిత శాఖ అధికారులు చూసి చూడనట్లు వదిలేసినట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

**చెరువులోకి వెళ్లేప్రధానకాలువను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు**

అనంతరం ఆయన మీడియాతోమాట్లాడుతూ,రాయికల్ గ్రామ పరిధిలోని ఊర చెరువుకు వెళ్లే ప్రధాన కాలువను పూర్తిగా రాళ్లు మట్టితో పూడ్చివేసి అనంతరం కాలువపైనే రోడ్డునిర్మాణం చేపట్టడం,చెరువుకి అడ్డుగా ఫ్రీ కాస్ట్ వాల్ నిర్మాణాన్ని చూసి ఆయన తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వలోని వివిధ శాఖల అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఎన్వోసీలు జారీ చేస్తూ పాటు కాలువలను,చెరువులను చరపెడుతున్న చూసి చూడనట్లు వదిలేస్తున్న అధికారుల పట్ల ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఆక్రమణకు గురైన కాలువను పునరుద్ధరించి చెరువులోకి నీటి ప్రవాహం సాఫీగా సాగేవిధంగావెంచర్ నిర్వాహకులపై కఠినచర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో తాను పై అధికారులకు ఫిర్యాదు చేస్తానని పై అధికారులు స్పందించనీ ఎడల కోర్టుకు వెళ్లడానికైనా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.








## వరద నీటిని సద్వినియోగం చేసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం..

**తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు..**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు హర్షవర్ధన్ రెడ్డి, మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ నాయకుడు రామూర్తి పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కృష్ణా నది ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరుతున్నప్పటికీఆ నీటిని సద్వినియోగం చేసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని నిల్వ చేసేందుకు ప్రాజెక్టులలోని పంపులను పూర్తిస్థాయిలో నడిపించి బీమా, కోయిల్ సాగర్, నెట్టెంపాడు, సంగంబండ తదితర రిజర్వాయర్లను నింపాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదని విమర్శించారు.

జూరాల ప్రాజెక్టు నుంచి కేవలం విద్యుత్ ఉత్పత్తి పేరుతో రోజూ 45 వేల నుంచి 50 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారని,అదే సమయంలో దిగువన ఉన్న రిజర్వాయర్లను నింపే చర్యలు చేపట్టడం లేదని మండిపడ్డారు. తక్షణమే అన్ని రిజర్వాయర్లు, ఎత్తిపోతల పథకాల పంపులను పూర్తిస్థాయిలో ప్రారంభించి వరద నీటిని నిల్వ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారులు తాగునీటి అవసరాలకు మాత్రమే నీరు ఇస్తాం.. వ్యవసాయానికి ఇవ్వం అనే ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు. గతంలో క్లిష్ట పరిస్థితుల్లోనూ నీటి నిర్వహణ ద్వారా రైతాంగాన్ని ఆదుకున్నామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో సాగునీటి కొరత ఏర్పడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వరదగా వస్తున్న ప్రతి నీటి చుక్కను నిల్వ చేసేందుకు చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మళ్లీ ఎడారిగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అన్ని ఎత్తిపోతల పథకాల పంపులను పూర్తిస్థాయిలో నడిపించి రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు.

## ఇసుక వాగు పై నాటు పడవ ఏర్పాటు



**వాజేడు,జులై 31,(ప్రజావినికిడి):**
మండలంలో చీకుపల్లి, పెద్దగొల్లగూడెం, మధ్యలో ఉన్న ఇసుక వాగు తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయిన సంగతి మండల వాసులకు తెలిసిందే కానీ గురువారం ఆ తాత్కాలిక రోడ్డు కాస్తా గోదావరి ముంపునకు గురైంది బ్రిడ్జి కాంటాక్టర్ కి ఏం చెయ్యాలో అర్థం కాక పై అధికారులకు తెలియజేసారు అసలే జాతీయ రహదారి మండలంలో 25,గ్రామాల ప్రజలు అత్యవసర పరిస్థితులో వెళ్ళాలి అంటే మార్గం లేకపోవడంతో అధికారులు నాటు పడవ ఏర్పాటు చేసారు.

## బొల్లారంలో సేవా సంస్థ అద్వర్యంలో విద్యా కానుక

**70 మంది విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ**




**వాజేడు,జులై 31,(ప్రజావినికిడి):** మొరుమూరు గ్రామ పంచాయతీ పరిధిలోని బొల్లారం ప్రభుత్వ పాఠశాలలో జీఎస్ఎస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం 70 మంది విద్యార్థులకు పాఠశాల స్కూల్ బ్యాగులు,నోటు పుస్తకాలు, పెన్నులు, పలకలు తదితర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి చేతుల మీదుగా విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు.ఈ కార్యక్రమంలో జీఎస్ఎస్ సేవా సంస్థ పర్యవేక్షకుడు రాము,సభ్యులు మురళిరెడ్డి, శ్యామ్,నవీన్, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# హోర్ముజ్ జలసంధి సంక్షోభం

## : భారత ఇంధన భద్రతకు ఎదురైన సవాలు 2026లో హోర్ముజ్ జలసంధి

**హైదరాబాద్, (ప్రజావినికిడి):**
మూసివేయబడటంతో భారత్‌కు ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఏర్పడింది. అయితే, దీర్ఘకాలిక ప్రణాళికలు ఇంధన వనరుల వైవిధ్యీకరణ వల్ల దేశం పెద్ద ఇంధన సంక్షోభాన్ని నివారించింది.

ప్రభుత్వం వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను (ఎస్ పిఆర్)విస్తరించి, అమెరికా,రష్యా, పశ్చిమ ఆఫ్రికా వంటి దేశాల నుంచి ముడి చమురు దిగుమతులను పెంచింది.అలాగే, రిఫైనరీల సామర్థ్యాన్ని మెరుగుపరచింది

ఈ చర్యలతో భారత్ ఇంధన భద్రతను మరింత బలోపేతం చేసుకొని, పశ్చిమ ఆసియాలోని భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావాన్ని గణనీయంగా తగ్గించగలిగింది.

**విశ్లేషణాత్మక అంశం: స్థిరత్వానికి కారణాలు (సంక్షిప్తంగా)**

2026లో హోర్ముజ్ జలసంధి దిగ్బంధం సమయంలో



భారత్ గల్ఫ్ దేశాలపై ఆధారాన్ని తగ్గించి తన ఇంధన భద్రతను కాపాడుకుంది. దీర్ఘకాలిక ఒప్పందాల ద్వారా చమురు దిగుమతులను విభిన్నీకరించి, రిఫైనరీలను వివిధ రకాల ముడి చమురును శుద్ధి చేసేలా ఆధునికీకరించింది.అలాగే, దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని రోజుకు 32,000 నుంచి 54,000 మెట్రిక్ టన్నులకు పెంచింది.ఈ చర్యల వల్ల జపాన్,దక్షిణ కొరియా వంటి దేశాలతో పోలిస్తే భారత్ ఇంధన కొరతను నివారించి, స్థిరమైన ఇంధన సరఫరాను కొనసాగించగలిగింది.

**వ్యూహాత్మక దృక్పథం**

భారతదేశం భవిష్యత్తులో ఇంధన భద్రత కోసం దిగుమతులపై ఆధారాన్ని తగ్గించి,కంప్రెస్డ్ బయోగ్యాస్ (సి బి జి ) వినియోగాన్ని పెంచడంతో పాటు ప్రత్యామ్నాయ పైప్‌లైన్ మార్గాలను అభివృద్ధి చేయాలి.2026 హోర్ముజ్ సంక్షోభం భారత్‌కు సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం ఉందని నిరూపించింది. దీర్ఘకాలిక ఇంధన భద్రత కోసం దేశీయ ఆవిష్కరణలు, వికేంద్రీకృత ఉత్పత్తి, మరియు బలమైన మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టడం అవసరం.

## గోదావరి పరివాహక ప్రజలు అలర్టుగా ఉండాలి



**వాజేడు,జులై 31,(ప్రజావినికిడి):**
సిడబ్ల్యుసి, సెంట్రల్ వాటర్ కమిషన్,వారు తెలిపిన సమాచారం ఆధారంగా ఎగువ నుంచి గోదావరి వరద ప్రవాహం అంతకంతకు పెరుగుతూ 31, వ తేది తెల్లవారుజాము వరకు సుమారు తొమ్మిది లక్షల క్యూసెక్కుల నీరు సమ్మక్క సాగర్ నుండి దిగువకు వరద నీరు రానున్నది అని సమాచారం.ఈ క్రమంలో 31,తేది తెల్లవారుజాము వరకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నది.గోదావరి నది పరివాహక ప్రాంతాలలో ఉన్న కన్నాయిగూడెం,ఏటూరునాగారం, వాజేడు, వెంకటాపురం, మంగపేట మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లకూడదని, అత్యవసర పరిస్థితులలో ప్రభుత్వ శాఖల అధికారుల సహాయం తీసుకోవాలని సూచన చేయడం జరిగింది.తదుపరి నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున గోదావరి నది లో చేపలు పట్టేవారు గాని,పరివాహక ప్రాంతంలోని మనుషులు నది లోకి వెళ్లడం గాని, పశువులును దాటించడం గాని చెయ్యవద్దు అని గోదావరి నది పరివాహక ప్రాంత ప్రజలకు తెలియచేయండి అని జిల్లా నీటి పారుదల అదికారులు, తెలిపారు.

## టేకులగూడెం వద్ద జాతీయ రహదారి పై గోదావరి



**వాజేడు,జులై 31,(ప్రజావినికిడి):**
వాజేడు మండలంలోని టేకులగూడెం 163,వ జాతీయ రహదారి గోదావరి ముంపునకు గురైంది దీంతో తెలంగాణ చత్తీస్గడ్ రాష్ట్రాలకు రాకపోకలు నిలిసిపోయాయి వాహన దారులు అటువైపు వెళ్ళకుండా టేకులగూడెం గ్రామ పంచాయతీ, పేరూరు పోలీస్ వారు ట్రాక్టర్లు అడ్డంగా పెట్టారు గోదావరి తీసేవరకు జాతీయ రహదారి మూసి ఉంటుంది అని తెలిపారు.

## కొందుర్గు పర్యటనలో పలువురిని పరామర్శించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి..





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదానికి గురైన కొందుర్గు మండల రేగడి చిల్కమరి గ్రామానికి చెందిన రాంచెంద్రి శ్రీరామ్,బాలయ్య,రాములు మల్లేష్,మరియు పర్వాతపూర్ గ్రామానికి చెందిన విద్యాసాగర్ తదితర బీఆర్ఎస్ కార్యకర్తలను ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని,త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్,కొందుర్గు మండల సర్పంచులు,మాజీ సర్పంచులు,బీఆర్ఎస్ నాయకులు,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్‌లో
# 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

**-ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి..**



**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు,భారత వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు తక్షణ సహాయ సేవలు అందించేందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసే ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.భారీ వర్షాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉందని,ప్రజల ప్రాణ,ఆస్తి రక్షణకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని రెవెన్యూ,పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ లోతట్టు ప్రాంతాలు,వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, వాగులు, వంకలు, చెరువుల పరిసరాల్లో నిరంతరశీ పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు,నీటితో నిండిన రహదారులను దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.విద్యుత్ తీగలు తెగిపడిన ప్రాంతాలకు దూరంగా ఉండాలని,చెట్లు కూలిపోయే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని,చిన్నారులు, వృద్ధుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వర్షాల కారణంగా ఎక్కడైనా ముంపు,రవాణా అంతరాయం లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని తెలిపారు. అందిన ప్రతి సమాచారంపై సంబంధిత శాఖలు తక్షణమే స్పందించి అవసరమైన సహాయక చర్యలు చేపట్టేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అన్ని మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తమ పరిధిలోని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు అధికారుల సూచనలు, వాతావరణ శాఖ హెచ్చరికలను తప్పనిసరిగా పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

**జిల్లా కంట్రోల్ రూమ్ సంప్రదింపు నంబర్లు:( 040-23237416( 9704958473**

## ముఖ్యమంత్రి సహకారం ఉండే హైడ్రా కె
# భూ మాఫియా వత్తిడి..

## సామాన్య జర్నలిస్టుల పరిస్థితి ఏమిటి.?

**సాధారణ రిపోర్టర్లు అనేక రకాల మాఫియాలను ఎలా ఎదుర్కొంటున్నారో..**

**వాస్తవాలను రాసినందుకు తప్పుడు కేసులను ఎదుర్కొనలేకపోతున్న జర్నలిస్టులు..**

**ఎవిడెన్స్, ప్రాథమిక విచారణ లేకుండానే ఎఫ్ఐఆర్‌లా.?**

**వాస్తవాలను, అవినీతి, అక్రమాలను తప్పుడు కేసుల భయంతో వెలుగులోకి తీసుకు రాలేకపోతున్న రిపోర్టర్లు..**



**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
రాష్ట్రంలో భూ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రా వ్యవస్థ కూడా ఇప్పుడు భూ మాఫియాల కుతంత్రాలకు తట్టుకోలేకపోతుందన్న చర్చ సాగుతోంది. ప్రభుత్వ ఉన్నత అధికారులే తమ విధులు నిర్వర్తించే క్రమంలో న్యాయపరమైన వివాదాలు, ఫిర్యాదులు, కేసులను ఎదుర్కొంటున్న పరిస్థితి కనిపిస్తే, ఎలాంటి అధికారిక రక్షణ లేకుండా ప్రజా సమస్యలను, అవినీతి, అక్రమాలను వెలుగులోకి తీసుకొస్తున్న సాధారణ జర్నలిస్టుల పరిస్థితి ఎలా ఉంటుందనే ప్రశ్న తీవ్రంగా వినిపిస్తోంది.

### భూ మాఫియాల ఒత్తిడిని ఎదుర్కొంటున్న హైడ్రా వ్యవస్థ

ప్రభుత్వ అధికారాలు, పోలీసు భద్రత, న్యాయపరమైన సహకారం ఉన్నప్పటికీ భూ మాఫియాలపై చర్యలు తీసుకునే అధికారులకు అనేక రకాల ఒత్తిళ్లు, బెదిరింపులు, విమర్శలు ఎదురవుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.అక్రమ నిర్మాణాల తొలగింపు, ప్రభుత్వ భూముల రక్షణ, ఆక్రమణలపై చర్యలు తీసుకునే క్రమంలో ఫిర్యాదులు,కోర్టు కేసులు,వ్యక్తిగత ఆరోపణలు ఎదురవుతున్న పరిస్థితులు చర్చనీయాంశమవుతున్నాయి. అయితే ప్రస్తుతం సమాజంలో నెలకొన్న అనేక అవినీతి అక్రమాలను వెలికితీస్తున్న రిపోర్టర్ల పై ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమ కేసులు నమోదు చేస్తున్నారు మరి వాటిని వాస్తవాలు రాసే రిపోర్టర్లు ఎలా ఎదుర్కోవాలి.

### సామాన్య జర్నలిస్టులు మాఫియాలను ఎలా ఎదుర్కొంటారు సార్

ప్రజల తరపున అవినీతి, అక్రమాలు, భూ దందాలు,ఇసుక మాఫియా, ఆహార కల్తీ మాఫియా,డ్రగ్స్ మాఫియా, లిక్కర్ మాఫియా,నకిలీ వ్యాపారాలు వంటి అనేక అవినీతి అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చేది ఎక్కువగా జర్నలిస్టులే. అయితే వారికి అధికార యంత్రాంగం లాంటి రక్షణ ఉండదు. అయినప్పటికీ ప్రజా ప్రయోజనం కోసం నిజాలను బయటపెట్టే పరిస్థితులలో చాలామందిపై ప్రాథమిక విచారణ లేకుండా, పూర్తిస్థాయిలో సాక్షాధారాలు లేకుండానే అక్రమ కేసులు క్షణాలలో పెడుతున్నారు పోలీసు అధికారులు అలాంటి పరిస్థితుల్లో జర్నలిస్టులపై తప్పుడు ఫిర్యాదులు, రాజకీయ, మాఫియాల బెదిరింపులు వస్తే వారు ఎలా నిలబడగలరనే ప్రశ్న ప్రభుత్వానికి పోలీసు ఉన్నత అధికారులకు ఎందుకు రావడం లేదో.?

### అవినీతి, అక్రమాలను బయటపెడితే అక్రమ కేసులేనా.?

అనేక సందర్భాల్లో అవినీతి లేదా అక్రమాలపై కథనాలు ప్రచురించిన అనంతరం సంబంధిత వ్యక్తుల నుంచి జర్నలిస్టులపై తప్పుడు ఫిర్యాదులు నమోదు అవుతున్నాయనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడమే తమ బాధ్యతగా భావించే రిపోర్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు కావడం పత్రికా స్వేచ్ఛకు సవాలుగా మారుతోందని మీడియా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జర్నలిస్టులపై ఫిర్యాదులు వచ్చినప్పుడు పోలీసు అధికారులు ప్రాథమిక ఆధారాలు, ప్రాథమిక విచారణ లేకుండానే ఆగమేఘాలమీద కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసము వాళ్లకే తెలియాలి.

### ప్రభుత్వ సహకారం ఉన్న అధికారులకే ఇబ్బందులు

ప్రభుత్వ ఉద్యోగం, చట్టపరమైన అధికారాలు, పోలీసు రక్షణ, ప్రభుత్వ న్యాయ సహాయం వంటి వ్యవస్థలు ఉన్న అధికారులకే అవినీతి అక్రమాలను కట్టడి చేయడానికి ప్రయత్నిస్తున్నందుకు అక్రమ కేసులు,ఒత్తిళ్ల ఎదురవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. అలాంటప్పుడు ఎలాంటి అధికారిక రక్షణ లేకుండా పనిచేసే ఫ్రీలాన్స్,రాష్ట్ర, జిల్లా,మండల స్థాయి జర్నలిస్టులు ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్రం మంత్రులు, పోలీసు కమిషనర్లు ఉన్నత అధికారులు అర్థం చేసుకోవాలని జర్నలిస్ట్ సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు.

### జర్నలిస్టులకు రక్షణ ఎక్కడ.?

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ వ్యవస్థ లేకపోవడం మరో ప్రధాన సమస్యగా మారింది. ప్రభుత్వ జీతం లేదు,పోలీసు భద్రత అసలే లేదు, న్యాయపరమైన సహాయం కూడా దొరకనే దొరకదు. అవినీతి, అక్రమాలను, వాస్తవాలను రాసినందుకు చాలా సందర్భాల్లో జర్నలిస్టులు అన్ని సమకూర్చుకోవాల్సి వస్తోంది. అయినప్పటికీ ప్రజా ప్రయోజనం కోసం ప్రమాదాలను, బెదిరింపులను, దాడులను లెక్కచేయకుండా వార్తలను అందిస్తున్నారు.

### ప్రాథమిక విచారణ లేకుండానే ఎఫ్ఐఆర్‌లా.?

జర్నలిస్టులపై ఫిర్యాదు అందిన వెంటనే పోలీసు అధికారులకు రిపోర్టర్లు అంటే ఎందుకు అంత కోపం,పగనో కాని ప్రాథమిక విచారణ చేయకుండానే సాక్షాధారాలు లేకున్నా క్షణాలలో కేసులు నమోదు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.కొన్ని సందర్భాల్లో రాజకీయ నాయకులు ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు రిపోర్టర్ల పై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించడమే డ్యూటీ గా కొంతమంది పోలీసు అధికారులు పెట్టుకున్నారు ఏమో.? చాలా సంఘటనలపై కూడా సందేహాలు తలెత్తుతున్నాయని మీడియా వర్గాలు చెబుతున్నాయి. ఈ అంశాలపై పారదర్శక విచారణ అవసరమని పలువురు సీనియర్ జర్నలిస్టులు కోరుతున్నారు.

### మాఫియాలను అరికట్టలేక పోతున్న వ్యవస్థ

భారీ అధికార యంత్రాంగం, ప్రత్యేక విభాగాలు, పోలీసు బలగాలు ఉన్నప్పటికీ భూ మాఫియా, ఇసుక మాఫియా,ఇతర అక్రమ నెట్‌వర్క్‌లను పూర్తిగా అరికట్టడం ప్రభుత్వానికి సవాలుగా మారుతోంది. అలాంటి పరిస్థితుల్లో ఒక జర్నలిస్టు ఒంటరిగా వాటిని ఎదుర్కోవడం ఎంతటి కష్టమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని దీనిని పోలీసు ఉన్నత అధికారులు అర్థం చేసుకోవాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు పేర్కొంటున్నారు.

### తప్పుడు కేసుల భయంతో తగ్గుతున్న దర్యాప్తు కథనాలు

వాస్తవాలను వెలికితీసే జర్నలిస్టులపై చాలావరకు తప్పుడు కేసులు, బెదిరింపులు పెరుగుతున్నాయనే అభిప్రాయం మీడియాలో బలంగా ఉంది. దీంతో అనేక మంది ఇన్వెస్టిగేషన్ జర్నలిస్టులు, రిపోర్టర్లు దర్యాప్తు కథనాలను అందించడంలో వెనుకంజ వేస్తున్నారు.ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే ప్రభుత్వానికి, అధికార యంత్రాంగానికి, ప్రజలకు తెలియాల్సిన అనేక కీలక అంశాలు, వాస్తవాలు వెలుగులోకి రాకపోవచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది.


### పత్రికా స్వేచ్ఛకు రక్షణ అవసరం

ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛాయుత మీడియా కీలకమైన స్తంభంగా భావిస్తారు. అవినీతి, అక్రమాలు, మాఫియాలపై వాస్తవాలను వెలికితీసే జర్నలిస్టులు చట్టపరమైన ఇబ్బందులు, తప్పుడు కేసులు, దాడులు, బెదిరింపులకు గురికాకుండా ఉండేలా తగిన రక్షణ కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని మీడియా వర్గాలు, పౌరసంఘాలు అభిప్రాయపడుతున్నాయి. నిజాలను వెలుగులోకి తీసుకురావడం నేరంగా మారితే ప్రజాస్వామ్య వ్యవస్థకే అది ఆందోళనకర పరిణామం మరి దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, డిజిపి,పోలీసు ఉన్నత అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూద్దాం

# డ్రైవింగ్ లో అంత "బిజీ" చూపించడం అవసరమా..

**ట్రాఫిక్ రూల్స్ కు పాతర.. చీటికిమాటికి ప్రమాదాల జాతర..**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
నేటి ఆధునిక కాలంలో మనిషి ప్రయాణం ఉరుకుల పరుగుల జీవితంగా మారిపోయింది. చెప్పలేనంత బిజీతనం డ్రైవింగ్ లో మాత్రమే చూపించడం పరపాటిగా అయిపోయింది. డ్రైవింగ్ పై,ట్రాఫిక్ రూల్స్ పై మిడిమిడి జ్ఞానంతో వాహనాలు నడిపేవారి సంఖ్య అధికమవుతుందితద్వారా ఇతరుల ప్రాణాలకు ప్రాణ సంకటంగా మారుతుంది.
చిన్న పెద్ద అన్న తేడా లేకుండా ట్రాఫిక్ రూల్స్ ను పాటించడంలోవిఫలమవుతున్నారు.రాష్ డ్రైవింగ్ తో పాటు రాంగ్ రూట్ల ప్రయాణం రోజు రోజుకుపెరిగిపోతుంది. ఊహించని విధంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతోమంది అమాయకుల ప్రాణాలు గాల్లో కలుస్తుండగా ఇంకెంతమంది క్షతగాత్రులుగామిగిలిపోతున్నారు.
డ్రైవింగ్ లో మాత్రమే అంత "బిజీ" చూపించడం అవసరమా ఎక్కడ లేని బిజీ తనం కేవలం వాహనాన్ని డ్రైవ్ చేసే సమయంలో మాత్రమే చూయిస్తున్నారని,ఎందుకిలా! కొద్దిగా మెల్లిగా రావచ్చు కదా అని చెబితే గొడవలకు దిగుతున్నారని పలువురు వాహనదారులు వాపోతున్నారు. క్షణికావేషానికి గురి కావడం.. రోడ్ల మీదనే ఘర్షణలకు దిగడం..కొన్ని సందర్భాల్లో ఈ పంచాయతీ పోలీస్ స్టేషన్ వరకు వెళుతున్నాయని పేర్కొంటున్నారు.ముఖ్యంగా మైనర్లు డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా యమ స్పీడ్ గా వచ్చి ప్రయాణానికి ఇబ్బందులు కలిగిస్తున్నారనిపేర్కొంటున్నారు.రెండు నిమిషాలు ఓపికగా ఉండే సహనం ఎవరికి లేకుండా పోయిందని,
ముఖ్యంగా యూటర్న్ ల దగ్గర,వై జంక్షన్ల దగ్గర,మూల మలుపుల వద్ద స్పీడ్ గా వచ్చి ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారని వివరిస్తున్నారు.




### ట్రాఫిక్ రూల్స్ కు పాతర ప్రమాదాల జాతర

జనాభాకు తగ్గట్టుగా వాహనాల సంఖ్య పెరిగిపోవడం, రోడ్ల విస్తీర్ణం పెరగకపోవడం,ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించక పోవడం క్రమేపి ప్రమాదాల పరంపర రోజు రోజుకు కొనసాగుతుందని సర్వేలు వెల్లడిస్తున్నాయి. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్న కనీస పరిజ్ఞానం ఉన్నప్పటికీ నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలనుబలితీసుకుంటున్నారనిఈ కేటగిరిలో ముఖ్యంగా మైనర్లు,యువకులతో పాటు విద్యార్థులు కూడా ట్రాఫిక్ రూల్స్ ను బ్రేక్ చేస్తున్నారని అంటున్నారు.
చట్టాలు కఠినంగా ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో శిక్షణ సంఖ్య అందుకు తగ్గట్టుగా లేకపోవడం విస్మయం కలిగిస్తుంది.

### ట్రాఫిక్ రూల్స్ పై,ప్రజలలో అవగాహన ఎంతో అవసరం.

ఇతరుల ప్రయాణానికి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన ప్రతిఒక్కరుపెంపొందించుకోవాల్సిన అవసరం ఉంది. పెరుగుతున్న జనాభాను, వాహనాల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని పోలీసు శాఖ ఎప్పటికప్పుడువాహనదారులకు పట్టణ ప్రాంతాలతో పాటు పల్లె ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా




నిర్వహించాలి.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే పడే శిక్షణలపైన స్పష్టమైన క్లారిటీ ఇవ్వాలి.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులను రక్షించే యోచనలో ఏ ఒక్కరు కూడా ఉండకూడదు.తప్పు చేశారు. కాబట్టి వారికి తగిన ట్రాఫిక్ శిక్ష విధించాల్సిన ఆవశ్యకత ఏర్పడాలి.తప్పు చేస్తే తప్పించుకునే అవకాశం లేకుండా చేసినప్పుడే ట్రాఫిక్ రూల్స్ కు అడ్డుకట్ట వేయడానికి అవకాశం ఉంటుంది.ట్రాఫిక్ పోలీసులు కూడా కేవలం ఫోటోలు తీయడం,చలాన్లను విధించడం, టార్గెట్ లు ఉన్నాయి కాబట్టి వాటిని వసూళ్లు చేయించే బాధ్యత వరికే పరిమితం కాకూడదు.ప్రతి ఒక్కరు సమన్వయంతో సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేసి ప్రమాదాల నివారణకు ప్రేరణగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# సిద్ధాపూర్ రైతుల తరపున ఢిల్లీకి వెళ్లిన బిజెపి నేతలు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి,అందే బాబయ్య..


**షాద్ నగర్,(ప్రజావినికిడి):**రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండలం సిద్ధాపూర్ గ్రామంలో ప్రతిపాదిత జీహెచ్ఎంసీ ఘన వ్యర్థాల నిర్వహణ (ఎస్ డబ్ల్యూఎం) కేంద్రం ఏర్పాటుపై జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ (ఎన్ సి ఎస్ సి) స్పందించింది. సిద్ధాపూర్ గ్రామానికి చెందిన పట్నం సురేష్ సమర్పించిన ఫిర్యాదును పరిశీలించిన కమిషన్,ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూకు అధికారిక లేఖ పంపింది. ఫిర్యాదులో పేర్కొన్న అంశాల ప్రకారం,ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ వల్ల షెడ్యూల్డ్ కులాల కుటుంబాలు,చిన్న రైతుల భూములు,జీవనోపాధి, ఆరోగ్యం,రాజ్యాంగ హక్కులు దెబ్బతినే అవకాశం ఉందని కమిషన్ పేర్కొంది. ఈ అంశం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 పరిధిలోకి వస్తుందని స్పష్టం చేసింది. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్ సంతకంతో జారీ చేసిన లేఖలో,సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
అలాగే విచారణ అనంతరం తీసుకున్న చర్యలు, సంబంధిత ఆధారాలతో కూడిన యాక్షన్ టేకెన్ రిపోర్ట్ (ఏటీఆర్)ను 15 రోజుల్లోగా కమిషన్‌కు



సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు.

**బీజేపీ నేతల చొరవతో ఢిల్లీ వరకు రైతుల పోరాటం**

సిద్ధాపూర్ రైతుల సమస్యను జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో బీజేపీ షాద్‌నగర్ సీనియర్ నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్యలు కీలక పాత్ర పోషించారు. రైతులకు అండగా నిలిచి,వారి సమస్యను ఢిల్లీకి తీసుకెళ్లి జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులను కలిసి సిద్ధాపూర్ రైతుల సమస్యను వివరించారు. వారి చొరవ,సమన్వయం ఫలితంగానే కమిషన్ వెంటనే స్పందించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక కోరడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ లేఖ ప్రతులను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్



वड्डेपल्ली रामचंदर
सदस्य
VADDEPALLI RAMCHANDER
MEMBER

सत्यमेव जयते
भारत सरकार
राष्ट्रीय अनुसूचित जाति आयोग
GOVERNMENT OF INDIA
NATIONAL COMMISSION FOR SCHEDULED CASTES

पाँचवीं मंजिल, लोकनायक भवन,
खान मार्किट, नई दिल्ली-110003
5th Floor, Loknayak Bhawan,
Khan Market, New Delhi-110003
Tel. : 011-24624801

DO No. 210/MEMBER (VR)/NCSC/2026
Dated the 29th July 2026

Dear Shri Sri Sanjay Jaju Ji,

Please refer to the representation submitted to this Commission by Shri Patnam Suresh, S/o Patnam Balayya, R/o Siddapur Village, Kothur Mandal, Ranga Reddy District, Telangana, vide representation dated 29.07.2026, seeking urgent intervention to safeguard the lands, livelihood, health and constitutional rights of Scheduled Caste families and small farmers likely to be affected by the proposed GHMC Solid Waste Management (SWM) Facility at Siddapur Village, Kothur Mandal, Ranga Reddy District, Telangana.

The allegations made in the representation disclose serious concerns relating to the possible infringement of the constitutional safeguards and socio-economic rights of the Scheduled Caste community. Since the issues raised fall within the constitutional mandate of the National Commission for Scheduled Castes under Article 338 of the Constitution of India, the matter warrants immediate attention and careful examination by the State Government.

Cont../-

శాఖ ప్రధాన కార్యదర్శి,జీహెచ్ఎంసీ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్,తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శికి కూడా పంపినట్లు లేఖలో పేర్కొన్నారు. సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ అంశం ఇప్పుడు జాతీయ స్థాయిలో చర్చకు రావడంతో, ప్రభుత్వం తీసుకోనున్న తదుపరి చర్యలపై రైతులు, గ్రామస్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# నాచారం అర్బన్ ఇంటర్మీడియట్ కాలేజీలో సైబర్ క్రైమ్ పై అవగాహన

**నాచారం,(ప్రజావినికిడి):**



నాచారం అర్బన్ ఇంటర్మీడియట్ కాలేజీలో నిర్వహించిన సైబర్ క్రైమ్ పై అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు సైబర్ నేరాల నివారణ,పిఓసి ఎస్ఓ చట్టం, డ్రగ్స్ దుష్ప్రభావాలు, రోడ్డు భద్రత, వ్యక్తిగత భద్రత వంటి ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా నాచారం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ గౌడ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ,విద్య యొక్క ప్రాముఖ్యత, క్రమశిక్షణ,సైబర్ భద్రత,సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించడం, అలాగే బాధ్యతగల పౌరులుగా ఎదగాల్సిన అవసరాన్ని వివరించారు. అనంతరం ఎస్ఐ మైబెల్లి సైబర్ నేరాల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ స్కామ్స్, ఫేక్ లోన్ యాప్స్, ఓటిపి మోసాలు, సోషల్ మీడియా మోసాల గురించి అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, అలాగే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ రామ్ మోహన్ సమన్వయం చేయగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని సైబర్ నేరాల నివారణకు సంబంధించిన విలువైన సూచనలు, జాగ్రత్తలను తెలుసుకున్నారు.

# జానంపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కళ్యాణ మహోత్సవం.



**షాద్ నగర్,జులై 30,(ప్రజావినికిడి):**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో జానంపేట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో ప్రతి నెల శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా,ఆషాడ మాసం పాడ్యమి గురువారము
రోజున వెంకటేశ్వరస్వామి వారి కళ్యాణం అంగర వంగ వైభవంగా నిర్వహించిన వేద బ్రాహ్మణోత్తములు,స్వామి వారి కళ్యాణంలో పాల్గొన్న పాలది విజయనిర్మల శివకుమార్, జ్యోతిగంగాధర్,భాగ్యరేఖ భూపాల్ రెడ్డి,సుమతి సురేందర్ రెడ్డి దంపతులు కల్యాణ మహోత్సవంలో షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే టిడిపి పోలీట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు,పుర ప్రముఖులు సాయిశ్వర్ రెడ్డి,బార్ కౌన్సిల్ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, 16వ వార్డ్ కౌన్సిలర్ఒగ్గు జయలక్ష్మికిషోర్,రాంభూపాల్,బాలరాజ్,కల్వ సతీష్,ప్రవీణ్, అధికసంఖ్యలో భక్తులు పాల్గొని ఆధ్యాంతం శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని వీక్షించి,పల్లకి సేవలో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు.



# షాద్‌నగర్ లో ఫ్రీ డిఫెన్స్ అకాడమీ ఉచిత శిక్షణ..

## అగ్నివీర్,ఆర్మీ పోలీస్ ఉద్యోగాల కోసం ఫిజికల్ ట్రైనింగ్..







**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్‌నగర్‌లో ఫ్రీ డిఫెన్స్ అకాడమీ గొప్ప అవకాశాన్ని కల్పిస్తోంది అగ్నివీర్ ఆర్మీ, భారత సైన్యం, పోలీస్,ఇతర డిఫెన్స్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు నక్క నరేందర్ యాదవ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో పూర్తిగా ఉచిత ఫిజికల్ ట్రైనింగ్ అందిస్తున్నారు. ఇటీవల అగ్నివీర్ ఆర్మీ రాత పరీక్షలో పాస్ అయిన అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా 1600 మీటర్ల రన్నింగ్ గ్రౌండ్ ప్రాక్టీస్ ప్రారంభించారు. అభ్యర్థులు తమ శారీరక సామర్థ్యాన్ని పెంపొందించుకుని ఫిజికల్ పరీక్షల్లో విజయవంతం కావడానికి అవసరమైన అన్ని రకాల శిక్షణను అందిస్తున్నారు.
ఫ్రీ డిఫెన్స్ అకాడమీలో ప్రతిరోజూ క్రమశిక్షణతో కూడిన ఫిజికల్ ట్రైనింగ్ రన్నింగ్ ఎండ్యూరెన్స్ ప్రాక్టీస్,ఫిట్‌నెస్ డ్రిల్స్,ఎంపిక పరీక్షలకు అనుగుణంగా ప్రత్యేక సాధన నిర్వహిస్తున్నారు డిఫెన్స్ రంగంలో ఉద్యోగం సాధించాలనే పట్టుదల ఉన్న ప్రతి అభ్యర్థికి ఇది ఎంతో ఉపయోగపడే అవకాశమని తెలిపారు.
ఈ సందర్భంగా అకాడమీ నక్క నరేందర్ యాదవ్ డైరెక్టర్ మాట్లాడుతూ, దేశ సేవ చేయాలనే లక్ష్యంతో ఉన్న ప్రతి యువకుడు ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన ఉంటే డిఫెన్స్ ఉద్యోగం సాధించడం మంచి అసాధ్యం కాదని అన్నారు. ప్రతి అభ్యర్థికి వ్యక్తిగతంగా మార్గనిర్దేశనం చేస్తూ ఫిజికల్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు ఉచితంగా ఫిజికల్ కోచింగ్ అందిస్తున్నప్పటికీ,హాస్టల్ సౌకర్యం అవసరమైన వారికి మాత్రమే 5000 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.
హాస్టల్ అవసరం లేని అభ్యర్థులు ఉచిత శిక్షణలో పాల్గొనవచ్చని అన్నారు .ఆర్మీ,అగ్నివీర్ పోలీస్ ఇతర డిఫెన్స్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రౌండ్ కు వచ్చి శిక్షణలో పాల్గొనాలని పిలుపునిచ్చారు క్రమ శిక్షణ తమ లక్ష్యాన్ని చేరుకునేలా మార్గనిర్దేశనం చేస్తున్నామని ఆయన తెలిపారు.
7569339339,9912470464

# ప్రజా పాలన అంటేనే.. అభివృద్ధికి చిరునామా..!

## గత ప్రభుత్వం అప్పులు చేస్తే.. మా ప్రభుత్వంలో అభివృద్ధి చేస్తున్నాం -మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

## ఉప్పల్ నియోజకవర్గంలో రూ.76.46 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి

**ఉప్పల్,(ప్రజావినికిడి):**
ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గత ప్రభుత్వ పదేళ్ళ పాలనలో అప్పులే చేసిందన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు అప్పులు తీర్చుకుంటూ మరో వైపు అభివృద్ధి పనులను చేపడుతున్నట్టుగా చెప్పారు.
ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల పరిధిలోని కాలనీలలో రూ.76.46 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి,వజ్రేష్ యాదవ్ తో కలిసి మంత్రి శ్రీధర్ బాబు గారు శంకుస్థాపన చేశారు.

**ఉప్పల్ నియోజకవర్గంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శంకుస్థాపన చేసిన పనుల వివరాలు**

రూ. 42 లక్షలతో రామంతాపూర్ చిన్న చెరువు సమీపంలోని భజరంగ్ వ్యాయామశాల వద్ద గ్రౌండ్ ఫ్లోర్ విస్తరణ, బోర్‌వెల్ తవ్వకం పనులు.
రూ. 48 లక్షలతో భజరంగ్ వ్యాయామశాలకు ఆధునిక జిమ్ పరికరాల ఏర్పాటు. రూ. 5.80 కోట్లతో ఉప్పల్ భగాయత్ ఫేజ్-1, రోడ్ నెం. 48 నుండి మూసీ నది వరకు వర్షపు నీటి కాలువ నిర్మాణ పనులు.
రూ.3 కోట్లతో ఉప్పల్ భగాయత్ రోడ్ నెం. 55లో వర్షపు నీటి కాలువ నిర్మాణ పనులు.
రూ.5 కోట్లతో భగాయత్ కమాన్ నుండి రోడ్ నెం. 44 వరకు ఎస్‌డబ్ల్యూ డ్రెయిన్ నిర్మాణ పనులు.
రూ.5.80 కోట్లతో ఉప్పల్ భగాయత్ రోడ్ నెం. 44 నుండి నాలా వరకు ఎస్‌డబ్ల్యూ డ్రెయిన్ నిర్మాణ పనులు.
రూ. 5.80కోట్లతో రోడ్ నెం. 22లో ఎస్‌డబ్ల్యూ డ్రెయిన్ నిర్మాణ పనులు.
రూ.3 కోట్లతో ఉప్పల్ భగాయత్ ఫేజ్-2 రోడ్ నెం. 6లో ఎస్‌డబ్ల్యూ డ్రెయిన్ నిర్మాణ పనులు. రూ.5.50 కోట్లతో ఉప్పల్ భగాయత్ రోడ్ నెం. 48, 22, 55 మరియు ప్రధాన రహదారిపై ఫుట్‌పాత్‌ల అభివృద్ధి పనులు
రూ.4.95 కోట్లతో ఉప్పల్ భగాయత్ లో మల్టీ స్పోర్ట్స్ అరేనా






నిర్మాణ పనులు. రూ. 1.12 కోట్లతో ఉప్పల్ డివిజన్ పరిధిలోని సెవెన్ హిల్స్ కాలనీ, గణేష్ నగర్‌లో దెబ్బతిన్న సీసీ రోడ్ల మరమ్మతులు పనులు. రూ. 61 లక్షలతో ఉప్పల్ డివిజన్ పరిధిలోని సెవెన్ హిల్స్ కాలనీలో సీసీ రోడ్ల మరమ్మతు పనులు.
రూ. 3.20 కోట్లతో ఉప్పల్ ఎక్స్ రోడ్ బస్ స్టాప్‌ను వి.టి. కమాన్ వద్ద ఉప్పల్ బస్ స్టాండ్‌కు తరలించేందుకు అదనపు డ్రైవ్‌వేలు తదితర పనులు.
రూ.1.38 కోట్లతో వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బాలకృష్ణ నగర్ ఫేజ్1లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు.
రూ.1.90 కోట్లతో వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బాలకృష్ణ నగర్ ఫేజ్II (ప్రధాన రహదారులు)లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు.
రూ.1.08 కోట్లతో వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బాలకృష్ణ నగర్ ఫేజ్II (అంతర్గత రహదారులు)లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు .
రూ.1.68 కోట్లతో వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బాలకృష్ణ నగర్ ఫేజ్3లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు రూ.90.50 లక్షలతో వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీ శ్రీకాంత్ నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు. రూ.93.50 లక్షలతో వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని రవీందర్ నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు.
రూ.1.08 కోట్లతో వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని కుర్మా నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు.
రూ.25 లక్షలతో వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు.
రూ.1.37 కోట్లతో వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సత్య నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు.
రూ.1.98 కోట్లతో వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సబేరా కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు. రూ. 80 లక్షలతో బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో గణేష్ ఆలయం వద్ద రిటైనింగ్ వాల్, స్టీల్ గిర్డర్ వంతెన నిర్మాణ పనులు. బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని గౌడ్స్ శ్మశానవాటికలో రూ.45 లక్షలతో దహన వేదిక,కట్టెల గది, మరుగుదొడ్ల మరమ్మతు పనులు.
బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని జహీద్ నగర్‌లో రూ.54 లక్షలతో సీసీ రోడ్ల మరమ్మతు పనులు.
బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో రూ.26 లక్షలతో బాబా కిరాణా స్టోర్ నుంచి ప్రమోద్ ప్లాస్టిక్ షాప్ వరకు సీసీ రోడ్డు మరమ్మతు పనులు.
బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని విశ్వకర్మ శ్మశానవాటికలో రూ.5 లక్షలతో అభివృద్ధి పనులు. రూ.35 లక్షలతో చిలుకానగర్ డివిజన్ పరిధిలోని బొడ్రాయి ప్రాంతంలో దెబ్బతిన్న సీసీ రోడ్ల మరమ్మతు పనులు. రూ.48 లక్షలతో చిలుకానగర్ డివిజన్ పరిధిలోని న్యూ రామ్‌నగర్ కాలనీలో దెబ్బతిన్న సీసీ రోడ్ల మరమ్మతు పనులు. రూ.30 లక్షలతో చిలుకానగర్ డివిజన్ పరిధిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఎదురుగా ఉన్న వీధిలో వర్షపు నీటి కాలువ (ూఔ డ్రెయిన్) పునర్నిర్మాణ పనులు.
రూ.70 లక్షలతో కుషాయిగూడ డివిజన్ పరిధిలోని కాప్రా నాలాపై జమ్మిగడ్డ వద్ద ఉన్న పాత ఆర్‌ఆర్ కల్వర్టు స్థానంలో ఆర్‌సీసీ రోడ్ క్రాసింగ్ కల్వర్టు నిర్మాణం, బలోపేతం, విస్తరణ పనులు.
రూ.60 లక్షలతో కుషాయిగూడ డివిజన్ పరిధిలోని ద్వారకాపురి వద్ద ఉన్న పాత ఆర్‌ఆర్ కల్వర్టు స్థానంలో ఆర్‌సీసీ రోడ్ క్రాసింగ్ కల్వర్టు నిర్మాణం, బలోపేతం, విస్తరణ పనులు.
రూ.45 లక్షలతో కుషాయిగూడ పరిధి వాసవి శివనగర్‌లో అంతర్గత వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు.
రూ.1.98 లక్షలతో చర్లపల్లి డివిజన్ పరిధిలోని సిల్వర్ ఓక్ బంగ్లాల అవుట్‌లెట్ నుంచి చిన్న చర్లపల్లి కల్వర్టు వద్ద నాలా వరకు తృతీయ వర్షపు నీటి కాలువ నిర్మాణ పనులు. రూ.1.98 లక్షలతో చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఈసీ నగర్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి జెన్ గార్డెన్ పార్కు వరకు తృతీయ వర్షపు నీటి కాలువ పునర్నిర్మాణ పనులు.
రూ.47 లక్షలతో చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఈసీ నగర్‌లో ప్లాట్ నెం.163 (గణేష్ దేవాలయం) నుంచి రైల్ విహార్ కాలనీ వరకు 450 మి.మీ. వ్యాసం గల =జజ ఛీ3 పైప్‌లైన్ ఏర్పాటు పనులు.
రూ.66 లక్షలతో చర్లపల్లి డివిజన్ పరిధిలోని చర్లపల్లి చెరువు అవుట్‌లెట్ నుంచి సిల్వర్ ఓక్ బంగ్లాల వరకు 600 మి.మీ. వ్యాసం గల =జజ ఛీ3 పైప్‌లైన్ ఏర్పాటు పనులు. రూ.35 లక్షలతో చర్లపల్లి డివిజన్ పరిధిలోని నేతాజీ నగర్‌లో హెచ్.నెం.2-3-90/47 నుంచి హెచ్.నెం.2-3-89/62 వరకు మరియు అంతర్గత వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు.
వంపుగూడ డివిజన్ పరిధిలోని వంపుగూడ నాలా నుంచి వంపుగూడ గ్రామం, సాకేత్ మిథిలా వరకు తృతీయ వర్షపు నీటి కాలువ నిర్మాణం రూ. 170.00 లక్షలు రూ.2 కోట్లతో కాప్రా డివిజన్ పరిధిలోని డీఎల్ఆర్ ఎన్‌క్లేవ్ నుంచి కందిగూడ ఎక్స్ రోడ్డు వరకు తృతీయ వర్షపు నీటి కాలువ పునర్నిర్మాణ పనులు.
రూ.1.85 కోట్లతో కాప్రా డివిజన్ పరిధిలోని కల్లు కాంపౌండ్ వద్ద ఉన్న డ్రెయిన్ నుంచి ఎల్లారెడ్డిగూడ ఎక్స్ రోడ్డు వరకు తృతీయ వర్షపు నీటి కాలువ నిర్మాణ పనులు.
రూ.1.38 కోట్లతో కాప్రా డివిజన్ పరిధిలోని ఆర్‌కే ఎన్‌క్లేవ్ వద్ద ఉన్న డ్రెయిన్ నుంచి సీడీఎంఏ కాంపౌండ్ గోడ వరకు తృతీయ వర్షపు నీటి కాలువ నిర్మాణ పనులు. రూ.1.85 కోట్లతో కాప్రా డివిజన్ పరిధిలోని అశోక్ కాలనీ నాలా నుంచి విజయ హైస్కూల్ వరకు తృతీయ వర్షపు నీటి కాలువ పునర్నిర్మాణ పనులు.
ఈ కార్యక్రమం లో ఉప్పల్ నియోజకవర్గం అన్ని డివిజన్ల అధ్యక్షులు ,మాజీ కార్పొరేటర్లు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్ నినో పరిస్థితుల ప్రభావంపై నివేదికను అందజేసిన కమిటీ

**కూరగాయల సాగును ప్రోత్సహించండి**

**సెంట్రలైజ్డ్ కిచెన్స్ పరిసర ప్రాంతాల్లో దృష్టి పెట్టండి**

**ఆర్గానిక్ సాగు దిశగా రైతులకు అవగాహన కల్పించండి**

**నిపుణుల కమిటీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్,జూలై 30,(ప్రజావినికిడి):** రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖతో కలిసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ నుంచి ఎక్స్టెన్షన్ అధికారులను నియమించి, సంబంధిత విభాగాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గురువారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఎల్ నినో పరిస్థితుల ప్రభావంపై నిపుణుల కమిటీ నివేదికను సమర్పించింది. నివేదికలో కమిటీ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. తెలంగాణలో ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రభావం, అత్యవసర కార్యాచరణ ప్రణాళికపై నివేదికలో ప్రస్తావించింది. రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని పేర్కొంది. గ్రామాలవారీగా అత్యవసర ప్రణాళికలు రూపొందించి పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, కూరగాయల పంటలను ప్రోత్సహించాలని తెలిపింది. 75శాతం సబ్సిడీతో ఈ పంటలకు సంబంధించిన విత్తనాలను అందించాలని, ప్రత్యామ్నాయ పంటలకు కొత్త రుణాలు మంజూరు చేయాలని కమిటీ సూచించింది. గత ఏడాది ఈ సీజన్ లో 79.49 లక్షల ఎకరాలు సాగవగా, ఈ ఏడాది 74.56 లక్షల ఎకరాలు మాత్రమే సాగయ్యాయని పేర్కొంది. పత్తి పంట 45 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3.62 లక్షల ఎకరాలు, వరి 14.92 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన పంటల సాగు ఉందని నివేదికలో తెలిపింది. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో 75 నుంచి 90శాతం సబ్సిడీ అందించి డ్రిప్, స్పిం÷-రక్లర్ సాగు పద్ధతులను ప్రోత్సహించాలని సూచించింది. పశుగ్రాస



విత్తనాలు సబ్సిడీపై అందించి? పశు గ్రాస సాగును ప్రోత్సహించాలని, సాగునీటి కోసం నిరంతర విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని తెలిపింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలంది. హైదరాబాద్ పరిసర గ్రామాల్లో కూరగాయల సాగును ప్రోత్సహిస్తూ రైతు బజార్లకు రవాణా సౌకర్యం కల్పించాలని నివేదికలో పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో డైరీ యూనిట్లను స్థాపించేందుకు ఆర్థిక సహాయం అందించాలని, అత్యవసర చర్యల అమలును పర్యవేక్షిం చేందుకు గ్రామస్థాయి బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, నిపుణుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని వ్యవసాయం, ఉద్యానవనం, పశు సంవర్ధక, సాగునీరు, గ్రామీణాభివృద్ధి తదితర రంగాలను పరిరక్షించేందుకు రూపొందించిన రాష్ట్ర స్థాయి సమగ్ర కార్యాచరణ నివేదికను నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి గురువారం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి బోధి సెంటర్ లో అందజేశారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపి, వ్యవసాయ శాఖ సీనియర్ అధికారులు కృపాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి లు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచివాలయం మీడియా సెంటర్ లో నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జీ.చిన్నారెడ్డి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో ఏర్పడే సవాళ్లను ముందుగానే అంచనా వేసి, వివిధ శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. రైతులకు నష్టం తగ్గించేలా నీటి వినియోగంలో పొదుపు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, నాణ్యమైన విత్తనాల అందుబాటు, పశుగ్రాస భద్రత, ఉద్యాన పంటల విస్తరణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు వంటి అంశాలకు నివేదికలో ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు.

## చైనా నుంచి ఇరాన్‌కు ఆయుధాలు

### చైనా తీరుపై ట్రంప్ అసహనం

**వాషింగ్టన్,జూలై 30 ,(ప్రజావినికిడి)::**అమెరికా విమానాలు, హెలికాప్టర్లకు తలనొప్పిగా మారిన కొన్ని ఆయుధాలను చైనా నుంచి ఇరాన్ కు సరఫరా చేసేందుకు రంగం సిద్ధమైంది. వీటి రవాణాకు పాకిస్థాన్‌ను మార్గంగా ఎంచుకొన్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ సంచలన కథనం ప్రచురించింది. దీంతో అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. పాక్ పేరు ఎత్తకుండా చైనాపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చైనా ఆయుధాల సరఫరా విషయం తెలుసుకొని తాను నిరాశకు గురైనట్లు పేర్కొన్నారు. తాము ఇరాన్‌కు ఆయుధాలు విక్రయించ బోమని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్వయంగా తనకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చైనా, రష్యాల నుంచి ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేయవద్దని గత వారం ట్రంప్ హెచ్చరికలు కూడా జారీ చేశారు. చైనా నుంచి దాదాపు 60 మిలియన్ డాలర్లకు పైగా విలువైన 400 షోల్డర్గ్÷ర్డ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కొనుగోలుకు ఒప్పందం జరిగింది. వీటితో తమ గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరాన్ భావిస్తోంది. అయితే.. ఈ డీల్‌కు టెహ్రాన్ పక్షాన హాంకాంగ్ చెందిన ఝూంగ్‌కింగ్ బావోషాంగ్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మధ్యవర్తిగా ఉంది. ఈ క్షిపణులను ఉత్తర చైనా నుంచి పాకిస్థాన్ మీదుగా ఇరాన్‌లోకి చేర్చాలని ప్రణాళిక సిద్ధం చేశారు. కాకపోతే వీటిని భూమార్గంలో తరలిస్తారా..? గగనతలంలో తీసుకెళతారా అనే అంశంపై స్పష్టత లేదు. అయితే ఈ కథనాలను చైనా కొట్టిపారేయడం గమనార్హం. ఈ క్రమంలోనే తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ అంశంపై స్పందించారు.

## విధి నిర్వహణలో భయానికి తావు లేదు

### నిజాయితీగా విద్యుక్త ధర్మం నిర్వహించండి

### సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర

**న్యూఢిల్లీ,జూలై 30,(ప్రజావినికిడి):** సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. విధుల్లో ధైర్యసాహసాలు ప్రదర్శించిన సిబ్బందికి సన్మానం చేసిన కార్యక్రమంలో ఆయన ఉత్తేజపూరిత ప్రసంగం చేశారు. ఎలాంటి భయం లేకుండా పనిచేయాలని బలగాలకు పిలుపునిచ్చారు. సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్‌గా ఇక్కడ నేను మీకో హామీ ఇస్తున్నాను. విధులు నిజాయతీగా నిర్వర్తించడంలో మీరు తీసుకునే నిర్ణయాలు, చర్యలకు నేను బాధ్యత వహిస్తాను. ప్రజాప్రయోజనం కోసం



తీసుకునే చర్యలకు జవాబుదారీగా వ్యవహరించాల్సి వస్తే.. దానిని నేను పూర్తిగా స్వీకరిస్తానని జ్ఞానేంద్ర తన సిబ్బందిని ఉద్దేశించి పేర్కొన్నారు. ఈ నెల 20న 'చలో పార్లమెంటు' నిరసనల సమయంలో భద్రతా విధులు నిర్వర్తించిన సీఆర్పీఎఫ్-ఆర్ఏఎఫ్ బలగాలు, పోలీసులు.. విద్యార్థులపై పె÷-లలెట్ గన్‌లతో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతోన్న వేళ.. జ్ఞానేంద్ర ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఆరోపణలపై సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ అంతకుముందు కూడా స్పందించారు. ఏదైనా భారీ ఆపరేషన్ తర్వాత తాము వృత్తిపరమైన మూల్యాంకనం చేపడతామని చెప్పారు. నిరసనకారులపై ఆర్ఏఎఫ్ సిబ్బంది తీసుకున్న చర్యల విషయంలోనూ ఆ పరిశీలన చేస్తామని తెలిపారు. అది తమ నిబంధనల్లో భాగమేనని చెప్పారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు దేశవ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర పోలీసులతో సహకరిస్తూ.. వైవిధ్య పరిస్థితులకు తగ్గట్టుగా వేగంగా స్పందించగల సామర్థ్యం వారి సొంతం. ఇక, ఏదైనా ప్రాంతంలో ఘర్షణలు, రద్దీ, అశాంతియుత పరిస్థితులను నెలకొన్నప్పుడు వాటిని నియంత్రించేందుకు సీఆర్‌పీఎఫ్‌లోని రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ను రంగంలోకి దింపుతారు.

## గిట్టుబాటు ధర కోసం పొగాకు రైతుల ఆందోళన.. జాతీయ రహదారి దిగ్బంధం

**ప్రకాశం జూలై 30 ,(ప్రజావినికిడి):**



వర్జీనియా పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రకాశం జిల్లా రైతాంగం పెద్ద ఎత్తున ఆందోళన బాట పట్టింది. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన ఈ నిరసన సెగతో జాతీయ రహదారిపై రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. రైతులు, రైతు సంఘాల నాయకులు భారీ సంఖ్యలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా తరలివచ్చి, టంగుటూరు టోల్‌ప్లాజా మరియు ముదిగొండ బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిని దిగ్బంధించారు.టోల్‌గేట్ వద్ద బైఠాయించిన రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. కష్టపడి పండించిన పంటకు సరైన ధర లభించక తీవ్రంగా నష్టపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కారణంగా చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు అక్కడ భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

## మోడీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి

**ప్రధాని పదవికి మోడీ రాజీనామా చేస్తేనే మంచిది**

**రాష్టాల్లో విద్యార్థులను వేధిస్తే మళ్లీ ఆందోళన తప్పదు**

**కాక్రోచ్ చీఫ్ అభిజిత్ దీప్కే హెచ్చరిక**

**పుణె,జూలై 30 ,(ప్రజావినికిడి)::** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పదవికి రాజీనామా చేసి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎద్దేవా చేశారు. దేశాన్ని పాలించడం కంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మోదీ బాగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని పదవికి రాజీనామా చేసి దేశాన్ని నడిపే బాధ్యతను మరో నాయకుడికి అప్పగించాలన్నారు. ఢిల్లీలో నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత తొలిసారి తన స్వస్థలమైన మహారాష్ట్రకు అభిజీత్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో ఆందోళనలను విరమించిన తర్వాత వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి నిరసనకారులను గుర్తించి వేధిస్తున్నాయని ఆరోపించారు. ఆయా ప్రభుత్వాలు వెంటనే ఈ వేధింపులను ఆపాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో విద్యార్థులు, యువత తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల్లో ఉన్న ఆగ్రహం ఏమాత్రం తగ్గలేదన్నారు.



యువత ఆగ్రహం ఒక్క మంత్రిపై కాదని, కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. యువతలో ఉన్న అసంతృప్తిని బీజేపీ ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతోందని అభిజీత్ విమర్శించారు. ఇలాగే విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటే ఉద్యమం మరింత ఉధృతమవుతుందని అభిజీత్ హెచ్చరించారు. వీరు ఉగ్రవాదులు కాదని, దేశ భవిష్యత్తని ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును ఇలాంటి పరిస్థితులకు గురి చేస్తే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లే అవసరమైతే ప్రభుత్వాన్నీ మార్చే ఉద్యమం చేపడతామని తేల్చిచెప్పారు. ఈసారి ఆందోళన మరింత భారీస్థాయిలో ఉంటుందని హెచ్చరించారు. ఢిల్లీ జంతర్‌మంతర్‌లో సీజేపీ నిరసన సందర్భంగా విద్యార్థులపై పె÷-లలెట్ గన్ వినియోగించిన ఘటనపైనా అభిజీత్ స్పందించారు. అమిత్ షా అయినా, మరెవరైనా సరే పెల్లెట్ గన్ కాల్పులకు ఆదేశాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం సీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకోవడంపై వచ్చిన విమర్శలను సీజేపీ వ్యవస్థాపకుడు తిప్పికొట్టారు. కార్యకర్తలు 36 రోజుల పాటు ఎండ, వర్షాన్ని లెక్కచేయకుండా కష్టపడి పోరాడారని, అలాంటి విజయం తర్వాత సంబరాలు చేసుకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత బీజేపీ కూడా సంబరాలు చేసుకుంటుందని గుర్తు చేశారు. తమ కార్యకర్తలు బీజేపీ మాదిరిగా రహదారులను దిగ్బంధం చేయలేదన్నారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను పార్లమెంట్‌లో బీజేపీ సన్మానించడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న తర్వాత ఆయనను సన్మానించడం ద్వారా బీజేపీ ఏ సందేశం ఇవ్వాలనుకుంటోందని ప్రశ్నించారు. పేపర్ లీక్ కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేదని అభిజీత్ ఆరోపించారు. ప్రధాని మోదీ మూడు రోజుల క్రితం పేపర్ లీక్ కేసుల కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, అయితే తొలి విచారణకే సీబీఐ తరఫు న్యాయవాది హాజరుకాకపోవడంతో కేసు వాయిదా పడిందని విమర్శించారు. బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన విమర్శలపైనా అభిజీత్ దీప్కే స్పందించారు. ఆమె పార్ట్‌టైమ్ రాజకీయ నాయకురాలని, సీరియస్ రాజకీయ నాయకులు చేసే వ్యాఖ్యలకే తాను స్పందిస్తానని వ్యాఖ్యానించారు.

## సీదిరితో జగన్ ములాఖత్ రద్దు

**సాయంత్రం 5 తరవాత జైలు వద్దకు జగన్ -నిబంధనల మేరకు ములాఖత్ కుదరదని తేల్చిన సిబ్బంది**

**శ్రీకాకుళం,జూలై 30,(ప్రజావినికిడి):**

వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుతో వైఎస్ జగన్ ములాఖత్‌కు జైలు అధికారులు అనుమతి నిరాకరించారు. నిర్ణయించిన సమయం ముగిసిన తర్వాత జైలు వద్దకు చేరుకోవడంతో, జైలు నిబంధనల ప్రకారం అధికారులు అనుమతి ఇవ్వలేదు. సాయంత్రం 5 గంటల తర్వాత సీదిరి అప్పలరాజును కలిసేందుకు వైసీపీ నేతలు అనుమతి కోరారు. ఈ విషయంపై జైలర్..

ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరపగా, జైలు నిబంధనల ప్రకారమే వ్యవహరించాలని అధికారులు స్పష్టం చేశారు. సాయంత్రం 5 గంటలలోపే ములాఖత్‌కు అనుమతి ఉంటుందని తెలిపారు. దీంతో జగన్ అప్పలరాజు ములాఖత్‌కు అనుమతి లభించలేదు. ఇకచేసేది లేక జైలు వద్ద అప్పలరాజు కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించారు. అంతకుముందు విశ్యాఖ చేరుకున్న జగన్ అక్కడి నుంచి రోడ్డు మార్గంలో శ్రీకాకుళం చేరుకున్నారు. ప్రస్తుతం అంపోలు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును ఆయన జైలులో ములాఖత్ ద్వారా పరామర్శించాలనుకున్నారు. ఎన్నికల అనంతరం జగన్ శ్రీకాకుళం జిల్లాకు రావడం ఇదే తొలిసారి కావడంతో వైసీపీ శ్రేణులు ఈ పర్యటనకు ప్రాధాన్యం ఇచ్చాయి. సీదిరి అప్పలరాజు కుమారుడు ద్విచక్ర



వాహనాన్ని ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనలో, కుమారుడిని కేసు నుంచి తప్పించేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపై పోలీసులు అప్పలరాజును అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన శ్రీకాకుళం జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో జగన్ ఆయనను పరామర్శించడానికి ఇక్కడికి చేరుకున్నారు. భోగాపురం, పూసపాటిరేగ, పైడి భీమవరం, రణస్థలం, ఎచ్చెర్ల మీదుగా అంపోలు జిల్లా జైలుకు చేరుకుని మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు అప్పలరాజుతో ములాఖత్ నిర్వహించాలనుకున్నారు. అయితే, వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో ఆంక్షలు విధించారు పోలీసులు.. జైలు వద్ద ములాఖత్‌కు మాత్రమే పోలీసులు అనుమతి ఇచ్చారు. ర్యాలీలు, భారీ జనసమీకరణకు అనుమతి లేదని శ్రీకాకుళం పోలీసులు స్పష్టం చేశారు. గతంలో క్రౌడ్ గ్యాదరింగ్‌ల సమయంలో చోటుచేసుకున్న ఘటనలు, ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన, శాంతిభద్రతల అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు..అయినా జగన్ సమయానికి అక్కడికి చేరుకోలేక పోయారు.

------------------------

# మరో లవ్ మూవీ శ్రీనివాస మంగాపురం

## ఆకట్టుకున్న జయకృష్ణ, రాషా తండానీ నటన

ఘట్టమనేని కుటుంబం నుంచి యువ హీరోగా పరిచయమవుతున్న జయకృష్ణ, ప్రముఖ నటి రవీనా టండన్ కూతురు రాషా తడాని జంటగా నటించిన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. 'ఆర్ఎక్స్ 100', మంగళవారం వంటి సంచలన చిత్రాల తర్వాత దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ చిత్రంపై మొదటి నుంచి భారీ అంచనాలున్నాయి. మోహన్ బాబు, శ్యామ్, బ్రహ్మాజీ వంటి హేమాహేమీలు ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యామ్) గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ. దర్శకుడు అజయ్ భూపతి కూడా 'శ్రీనివాస మంగాపురం' కోసం ఇదే రొటీన్ మాస్ కమర్షియల్ బాటపట్టారు. స్టోరీ పరంగా పెద్దగా కొత్తదనం లేకపోయినా.. విలన్ క్రూరత్వం, హీరోయిన్ వెనక హీరో పడే లవ్ ట్రాక్, మధ్య మధ్యలో వచ్చే పాటలతో ప్రథమార్థం సాగిపోతుంది. జై కృష్ణ తన డాన్సులతో అలరించగా, నరేష్, బ్రహ్మాజీల కామెడీ మంచి రిలాక్సేషన్ ఇస్తుంది. ద్వితీయార్థంలో వచ్చే ఫ్లాష్ బ్యాక్, హీరో హీరోయిన్ల అసలు కథ, యాక్షన్ సీక్వెన్సెస్ ఎమోషనల్గా కనెక్ట్ అవుతాయి. తన గత చిత్రాల తరహాలో కాకుండా, అజయ్ భూపతి ఎలాంటి రిస్క్ తీసుకోకుండా పూర్తిగా 'సేఫ్ గేమ్' ఆడేశారు. పకడ్బందీ స్క్రీన్ ప్లే, బలమైన క్యారెక్టరైజేషన్స్పై మరికాస్త దృష్టి పెట్టి ఉంటే ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామా మరో స్థాయిలో ఉండేది. జయకృష్ణ, రాషా తడాని తమ తొలి సినిమాతోనే అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. ముఖ్యంగా జయకృష్ణ ఎమోషనల్ సన్నివేశాల్లో మంచి పరిణతి చూపించాడు. డాన్సులు, యాక్షన్ సీక్వెన్స్లలోనూ ఆకట్టుకున్నాడు. రాషా తడాని కూడా తన అందం, అభినయంతో తొలి చిత్రంతోనే మంచి మార్కులు కొట్టేసింది. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకే హైలైట్గా నిలిచింది. మోహన్ బాబు తన సీనియారిటీతో, పవర్ ఫుల్ ఇంటెన్సిటీతో పాత్రకు పూర్తి న్యాయం చేశారు. కిక్ శ్యామ్, అజయ్ తమ విలనిజంతో సినిమాను నిలబెట్టగా.. బ్రహ్మాజీ, నరేష్ల కామెడీ అక్కడక్కడా నవ్విస్తుంది. దర్శకుడు అజయ్ భూపతి ఎంచుకున్న లవ్ అండ్ ఫ్యాక్షన్ బ్యాక్డ్రాప్




బాగుంది. సంగీత దర్శకుడు జీవి ప్రకాష్ కుమార్ అందించిన పాటలు, బ్యాక్గ్రౌండ్ స్కోర్ సినిమా స్థాయిని పెంచాయి. ముఖ్యంగా స్క్రీన్ పై పాటలు మరింత రిచ్గా కనిపిస్తాయి.

# లెనిన్ సరికొత్త రికార్డులు

## వందకోట్ల క్లబ్బులో అఖిల్ లెనిన్ చేరిక




టాలీవుడ్ యువ సామ్రాట్ అఖిల్ అక్కినేని కెరీర్లో ఓ సరికొత్త చరిత్రాత్మక అధ్యాయం మొదలైంది. ఆయన నటించిన మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ లెనిన్ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు సృష్టిస్తూ, ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్ల మైలురాయిని విజయవంతంగా అధిగమించింది. దీంతో అఖిల్ కెరీర్లో తొలి బ్లాక్ బస్టర్ను నమోదు చేయడంతో పాటు తొలి రూ.100 కోట్ల సినిమాగా రికార్డుల కెక్కింది. జూలై 10న భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా, తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్ను సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. దర్శకుడు మురళి కిషోర్ అబ్బూరు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ముఖ్యంగా సినిమాలో అఖిల్ కొత్త మేకోవర్, పవర్ ప్యాక్డ్ మాస్ యాక్షన్ సీక్వెన్స్లు, హై-ఓల్టేజ్ ఎమోషనల్ సన్నివేశాలు థియేటర్లలో ప్రేక్షకులను కట్టిపడేశాయి. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్టైన్మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించాయి. నిర్మాత నాగవంశీ, నాగార్జున అనుసరించిన పబ్లిసిటీ వ్యూహాలు సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఇక తమ అభిమాన హీరో అఖిల్ ఖాతాలో తొలి బి÷-గగెస్ట్ బ్లాక్బస్టర్ హిట్ పడటంతో అక్కినేని అభిమానులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా విజయాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ కూడా సంతోషం వ్యక్తం చేస్తూ ప్రేక్షకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సూర్య 47 దీపావళి బరికోసం సిద్ధం




తమిళ స్టార్ హీరో సూర్యకు ఇప్పటికే వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. రీసెంట్ గా జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సూర్య47' షూటింగ్ను పూర్తి చేశారు. చిత్రబృందం విడుదల చేసిన బీహైండ్ ది సీన్స్ వీడియోతో షూటింగ్ ముగిసిన విషయాన్ని అధికారికంగా వెల్లడించగా, ఇప్పుడు ఈ సినిమా విడుదల తేదీపై ఆసక్తికర చర్చ మొదలైంది. అందుతున్న సమాచారం ప్రకారం, 'సూర్య47'ను ఈ దీపావళి సందర్భంగా థియేటర్లలో విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ వార్త నిజమైతే సూర్యకు ఇది వరుసగా మూడో థియేట్రికల్ విడుదలగా నిలవనుంది. ఇప్పటికే 'కరుప్పు'తో ప్రేక్షకులను పలకరించిన ఆయన, ఆగస్టు 14న వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆ సినిమా విడుదలైన కొద్ది నెలలకే 'సూర్య47' కూడా థియేటర్లలోకి వస్తే, ఒకే ఏడాదిలో వరుసగా మూడు సినిమాలతో అభిమానులను అలరించిన హీరోగా సూర్య నిలుస్తారు. అయితే దీపావళి బరిలో వెట్రిమారన్ దర్శకత్వంలో సిలంబరసన్ టి.ఆర్ నటిస్తున్న 'అరసన్' కూడా విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది.

# విశ్వంభరతో పోటీ పడనున్న జైలర్-2

అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి ఆయన అభిమానులు ఇప్పటినుంచే ఇప్పటి నుంచే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అయితే ఆగష్టు 22న రానున్న మెగాస్టార్ బర్త్ డే కానుకగా ఆయన నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సోషియో-ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' నుంచి అదిరిపోయే అప్డేట్ రాబోతున్నట్లు తెలుస్తుంది. దర్శకుడు మల్లిడి వశిష్ట తెరకెక్కిస్తున్న ఈ భారీ బ్జడెట్ చిత్రం, విజువల్ ఎఫెక్ట్స్ పనుల కారణంగా ఇంతకాలం ఆలస్యం అయినప్పటికీ, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను శరవేగంగా ముగింపు దశకు తీసుకువచ్చింది. యూవీ క్రియేషన్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో అందాల తార త్రిష నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి అద్భుతమైన బాణీలు, నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నారు. కాగా, ఈ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్ను దసరా పండుగకు టా÷-గ్గ్÷ట్ చేస్తూ అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన ఆగస్టు 22న చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా చిత్రబృందం ప్రకటించబోతున్నట్లు సమాచారం. అయితే చిరంజీవి దసరా పండుగకు రాబోతుండటం అంతకంటే ఒక్కరోజు ముందుగానే రజనీకాంత్ జైలర్ 2 ప్రేక్షకులు రాబోతుండడంతో ఈ రెండు సినిమాలకు బాక్సాఫీస్ వద్ద బిగ్ క్లాష్ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ భారీ పోటీతో టాలీవుడ్ వర్సెస్ కోలీవుడ్ బాక్సాఫీస్ వార్ తారాస్థాయికి చేరడం ఖాయమని ట్రేడ్ నిపుణులు భావిస్తున్నారు.

------




# సినిమాను మూడేళ్లు తీయడమే పెద్ద దరిద్రం

## : నిర్మాత ధీరజ్ మొగిలినేని



'చెన్నై లవ్ స్టోరీ' చిత్రం విజయం పొందిన ఆనందంలో ఉన్న యువ నిర్మాత ధీరజ్ మొగిలినేని... తాజాగా ఓ ఇంటర్వ్యూలో తెలుగు సినీ పరిశ్రమ తీరుపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఇండస్ట్రీలో ప్రాజెక్టుల ఆలస్యంపై ఆయన ఘాటుగా స్పందిస్తూ తన అసహనాన్ని వ్యక్తం చేశారు.

"టాలీవుడ్లో ఉన్న పెద్ద దరిద్రం ఏంటంటే.. ఒక్కో సినిమాను మూడేళ్ల పాటు తీస్తూ పోవడమే. ఎస్.ఎస్. రాజమౌళి, సుకుమార్ వంటి స్టార్ డైరెక్టర్లు తమ భారీ ప్రాజెక్టుల కోసం మూడేళు సమయం తీసుకుంటే అందులో ఒక అర్థం ఉంది. కానీ కొందరు ఇతర దర్శకులు కూడా అనవసరంగా సినిమా పూర్తి చేయడానికి మూడేళ్ల సమయం తీసుకుంటున్నారు" అని విమర్శించారు. ఈ తీరు వల్ల హీరోలు ఏళ్ల తరబడి ఒకే ప్రాజెక్ట్కు పరిమితమైపోతున్నారని, అభిమానులు కూడా తీవ్ర నిరాశకు గురవుతున్నారని ధీరజ్ తెలిపారు. ఒక సినిమాను సాధ్యమైనంత వరకు 10 నెలల్లో లేదా మహా అయితే ఏడాదిన్నర లోపు పూర్తి చేస్తేనే నిర్మాత సురక్షితంగా ఉంటాడని, ఇండస్ట్రీ కూడా ఆరోగ్యకరమైన దిశగా ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్గా మారాయి.

# వచ్చేసింది 'రామాయణ' ట్రైలర్..

## అంచనాలకు మించి విజువల్ వండర్!



భారత సినీ ప్రేక్షకులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ'. ఎట్టకేలకు ఈ సినిమాకు సంబంధించిన తొలి భాగం ట్రైలర్ను ఈరోజు తెల్లవారుజామున చిత్రబృందం విడుదల చేసింది. రాముడిగా రణ్బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్న ఈ చిత్ర ట్రైలర్, విడుదలైన క్షణం నుంచే సోషల్ మీడియాలో ప్రభంజనం సృష్టిస్తోంది. అద్భుతమైన విజువల్స్, భారీ తారాగణం, ఆకట్టుకునే నేపథ్య సంగీతంతో ట్రైలర్ అంచనాలను మించి ఉందని ప్రేక్షకులు ప్రశంసలు కురిపిస్తున్నారు. 4.09 నిమిషాల నిడివితో కట్ చేసిన ఈ ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. ముల్లోకాలకు అధిపతిని తానేనంటూ గర్వంగా ప్రకటించుకునే రావణుడి (యశ్) సంభాషణతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. లోకంలో అధర్మం పెరిగిపోతున్నప్పుడు, విష్ణువు రాముడి అవతారంలో భూమిపైకి వస్తాడు. రాముడి (రణ్బీర్) బాల్యం, రాక్షసులతో పోరాటాలు, సీతతో వివాహం వంటి ఘట్టాలను చూపించారు. ఆ తర్వాత 14 ఏళ్ల వనవాసం, లక్ష్మణుడితో కలిసి సీతారాములు అడవులకు వెళ్లడం, రావణుడు సీతను అపహరించడం వంటి కీలక సన్నివేశాలతో ట్రైలర్ కథపై ఆసక్తిని పెంచింది. ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్, నేపథ్య సంగీతం సినిమా స్థాయిని తెలియజేస్తున్నాయి. ఈ చిత్రంలో భారీ తారాగణం నటిస్తోంది. ఒకప్పటి 'రామానంద్ సాగర్' సీరియల్లో రాముడిగా మెప్పించిన అరుణ్ గోవిల్ ఇప్పుడు దశరథుడి పాత్రలో కనిపించడం విశేషం. హనుమంతుడిగా సన్నీడియోల్, లక్ష్మణుడిగా రవి దూబే, కౌసల్యగా ఇందిరా కృష్ణన్, కైకేయిగా లారాదత్త, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్ తమ పాత్రల్లో ఒదిగిపోయారు. నిజానికి ఈ ట్రైలర్ను అధికారికంగా విడుదల చేయడానికి ముందే న్యూఢిల్లీలోని భారత్ మండపంలో, ముంబైలో, శాన్ డియాగో కామిక్-కాన్లో ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఆ ఈవెంట్ల నుంచి కొన్ని క్లిప్స్ సోషల్ మీడియాలో లీక్ కావడంతో ట్రైలర్ను విడుదల చేయాలని అభిమానుల నుంచి తీవ్రమైన ఒత్తిడి వచ్చింది. ఈ నేపథ్యంలోనే మేకర్స్ అధికారికంగా ట్రైలర్ను రిలీజ్ చేశారు. నితీశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను నమితా మల్హోత్రా సుమారు రూ.4000 కోట్ల భారీ బడ్జెట్తో నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా రానున్న ఈ చిత్రంలో 'రామాయణ: పార్ట్-1' ఈ ఏడాది దీపావళికి థియేటర్లలోకి రానుండగా, రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు వస్తుంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613